
విశాలభారతి

త్రిక

సీఎం రేవంత్ రెడ్డి తీరుతోనే
ఏపీ జలదోపిడీ

- ఏపీ జలదోపిడీకి రేవంత్ తీరే కారణం: కవిత
- చంద్రబాబుకు నీళ్లు అప్పగించారంటూ సీఎం పై విమర్శలు
- నాగార్జున సాగర్ నీటిపై ఏపీ కన్ను: కవిత
- పల్నాడు వాటర్ గ్రిడ్‌కు కేంద్ర నిధులపై అభ్యంతరం
- ఏపీ ప్రాజెక్టును ఆపేందుకు బీజేపీ నేతలకు డిమాండ్

03





చిల్లర రాజకీయాలు మానుకోవాలి

- శ్రీకాంత్ చారి కుటుంబంతో రాజకీయాలు చేయడం సరికాదని విమర్శ
- తెలంగాణ ఉద్యమంలో రేవంత్‌రెడ్డి పాల్గొనలేదని ఆరోపణ
- కవిత త్యాగాలపై ఎంపీ అరవింద్ ప్రశ్నలు
- కాళేశ్వరం డిజైన్‌లోనే లోపాలున్నాయని విమర్శ
- కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని ఆరోపణ

03



నా పిలుపుతో బంగారం కొనుగోళ్లు తగ్గాయి

- బంగారం కొనుగోళ్లు తగ్గించాలన్న పిలుపుకు ప్రజల స్పందన: మోదీ
- కొనుగోళ్లు తగ్గడంతో పసిడి ధరలు దిగివచ్చాయని వ్యాఖ్య
- ఐటీఐ నైపుణ్యాలకు ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న డిమాండ్
- నైపుణ్య కార్మికుల ఉద్యోగాలను ఏఐ లాక్కోలేదని మోదీ

02

అసమ్మతి జ్వాలలు ఆగేనా?

తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు
రాజగోపాల్‌రెడ్డి రేవంత్ ప్రభుత్వంపై విమర్శలు

అనిరుధ్‌రెడ్డి అధికారుల అవినీతిపై ఆరోపణలు

సీఎం వ్యాఖ్యలతో కాంగ్రెస్‌లో కొత్త వివాదం

మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య ఆధిపత్య పోరు

అసమ్మతి నేతలపై చర్యలకు సిద్ధమవుతున్న అధిష్ఠానం

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్ల పాలనకు చేరువవుతున్న సమయంలో అంతర్గత విభేదాలు పెరగడం పార్టీలో తీవ్ర గందరగోళం నెలకొన్నది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు, అభివృద్ధి పనులకు నిధులు, ప్రభుత్వ పనితీరు వంటి అంశాలపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన తరుణంలో సొంత పార్టీ నేతల విమర్శలు నాయకత్వానికి సవాలుగా మారుతున్నాయి. ఈ అసమ్మతి వెనుక కేవలం నిధుల సమస్యలే ఉన్నాయా? పార్టీ పదవులు, రాజకీయ ప్రాధాన్యం, నియోజకవర్గాల్లో ఆధిపత్యం వంటి అంశాలు కూడా కారణమవుతున్నాయా? అన్న చర్చ సాగుతోంది.

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

కాంగ్రెస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం కారణంగానే నాయకులు బహిరంగంగా అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారన్న వాదన కూడా ఉంది. అయితే విమర్శలు వ్యక్తిగత ఆరోపణల స్థాయికి చేరినప్పుడు అవి ప్రభుత్వ ప్రతిష్ఠపై ప్రభావం చూపే అవకాశముంది. తాజాగా అసమ్మతి నేతలను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలతో పరిస్థితి మరింత వేడెక్కింది. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మొదలుపెట్టిన విమర్శల పర్వం ఇప్పుడు కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టికి చేరింది. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి ఆరోపణలు ప్రభుత్వ పనితీరుపై కొత్త ప్రశ్నలను లేవనెత్తాయి. మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య విభేదాలు కూడా పార్టీ నాయకత్వానికి తలనొప్పిగా మారాయి.మరోవైపు అసమ్మతి నేతలపై క్రమశిక్షణ చర్యలకు కాంగ్రెస్ సిద్ధమవుతోందన్న సంకేతాలు వెలువడుతున్నాయి. దీంతో తెలంగాణ కాంగ్రెస్‌లో అసలు ఏం జరుగుతోంది? ఈ విభేదాలు నాయకత్వ పోరుకు దారితీస్తాయా? అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకోబోతోంది? అన్న ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి.తెలంగాణ కాంగ్రెస్‌లో అసమ్మతికి ప్రధాన కేంద్రంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మారారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించడం లేదంటూ ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కు మార్‌రెడ్డిపైనా విమర్శలు చేశారు.కొడంగల్ వంటి నియోజకవర్గాలకు ప్రాధాన్యం ఇస్తూ మునుగోడును నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. రోడ్లు, సాగునీటి పనులు నిధుల కొరతతో నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు మంత్రి పదవి అవసరం లేదని,

మిగతా 2లో..

రాజగోపాల్‌రెడ్డికి హైకమాండ్ ఫోన్!

- ఈ నెల 23న ఏఐసీసీ ఇన్‌ఛార్జితో సమావేశం
- రాజగోపాల్‌రెడ్డికి కాంగ్రెస్ హైకమాండ్ నుంచి ఫోన్
- రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలను పరిశీలిస్తున్న అధిష్ఠానం
- క్రమశిక్షణ చర్యలపై ఏఐసీసీ నిర్ణయం తీసుకోనుంది
- మునుగోడుకు నిధులు ఇవ్వడం లేదని రాజగోపాల్‌రెడ్డి విమర్శ
- అనిరుధ్‌రెడ్డి వ్యాఖ్యలపైనా హైకమాండ్ ఆరా



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణ కాంగ్రెస్‌లో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యవహారం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. సొంత ప్రభుత్వంపైనే విమర్శలు గుప్పించిన ఆయనకు కాంగ్రెస్ హైకమాండ్ నుంచి ఫోన్ రావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నెల 23న తెలంగాణ కొత్త ఏఐసీసీ ఇన్‌ఛార్జి బి.ఎం. సందీప్‌తో సమావేశం కావాలని ఏఐసీసీ కార్యదర్శి సూచించారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ పనితీరుపై రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు పార్టీ వర్గాల్లో చర్చకు దారితీశాయి. ముఖ్యంగా మునుగోడుకు నిధుల కేటాయింపుపై ఆయన బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేయడం అధిష్ఠానం దృష్టికి వెళ్లింది. ఈ నేపథ్యంలో కొత్త ఇన్‌ఛార్జితో సమావేశం కీలకంగా మారనుంది. ఒకవైపు నియోజకవర్గ అభివృద్ధి కోసం పోరాడుతున్నానని రాజగోపాల్ రెడ్డి చెబుతుండగా, మరోవైపు పార్టీ క్రమశిక్షణ అంశం తెరపైకి వచ్చింది. దీంతో కాంగ్రెస్ అంతర్గత

మిగతా 2లో..

సన్న వడ్ల బోనస్‌పై జీవో ఏది?



02

- ధాన్యం కొనుగోళ్ల జాప్యంపై హరీశ్ రావు ఆగ్రహం
- సిద్దిపేట జిల్లాలో 70 కొనుగోలు కేంద్రాలు మూసివేత
- గతేడాదితో పోలిస్తే కొనుగోళ్లు భారీగా తగ్గాయని విమర్శ.
- ప్రైవేట్ వ్యాపారులతో రైతులకు క్వింటాల్‌పై రూ.461 నష్టం
- పెద్దకోడూరులో రైతులు ధాన్యం కొనుగోళ్ల కోసం ఎదురుచూపులు
- అన్ని రకాల సన్న వడ్లు కొనుగోలు చేయాలని హరీశ్ డిమాండ్

మంత్రి ఓఎస్డీ పేరుతో
భారీ మోసం

- ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు టోకరా
- నకిలీ ఓఎస్డీ బాగోతం.. 8 మందికి కుచ్చుటోపీ
- ఉద్యోగాల ఆశ చూపి రూ.50.87 లక్షలు వసూలు
- నకిలీ ఐడీ కార్డులతో ప్రభుత్వ ఉద్యోగాల మోసం
- తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో నకిలీ నియామకాలు



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామంటూ నిరుద్యోగులను నమ్మించి లక్షల రూపాయలు వసూలు చేసిన భారీ మోసం హైదరాబాద్‌లో బయటపడింది. ఏకంగా ఐటీ శాఖ మంత్రి ఓఎస్‌డీ పేరుతో నకిలీ గుర్తింపు కార్డు సృష్టించి ఈ దందా నడిపినట్లు పోలీసులు గుర్తించారు. ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న యువతను లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వంలో తమకు పలుకుబడి ఉందని నమ్మించారు. నకిలీ నియామక ఉత్తర్వులు, ప్రభుత్వ వెబ్‌సైట్లను పోలిన పోర్టల్స్ చూపించి అనుమానం రాకుండా వ్యవహరించారు. ఉద్యోగం ఖాయమని నమ్మిన నలుగురు బాధితుల నుంచి ఏకంగా రూ.50.87 లక్షలు వసూలు చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. డబ్బులు చెల్లించిన తర్వాత నెలలు గడిచినా ఉద్యోగాలు రాకపోవడంతో బాధితుల్లో అనుమానాలు మొదలయ్యాయి. చివరకు మంత్రి కార్యాలయాన్ని సంప్రదించడంతో అసలు వ్యవహారం బయటపడింది. ఈ ఘటన ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో జరుగుతున్న డిజిటల్ మోసాలపై మరోసారి చర్చకు దారితీసింది. నిరుద్యోగుల ఆశలను పెట్టుబడిగా మార్చుకున్న నిందితులు చాలా పక్కాగా మోసానికి ప్లాన్ చేసినట్లు పోలీసులు చెబుతున్నారు.

మిగతా 3లో..

తెలంగాణకు రూ.4,000 కోట్ల పెట్టుబడి



సఫ్రాన్ నుంచి తెలంగాణకు భారీ పెట్టుబడులు

సఫ్రాన్ ప్రతినిధులతో భట్టి విక్రమార్క భేటీ

హైదరాబాద్‌లో సఫ్రాన్ తయారీ యూనిట్ల నిర్వహణ

విమాన ఇంజిన్ల విడిభాగాల తయారీలో సఫ్రాన్

డిసెంబర్‌లో సఫ్రాన్‌తో ఎంఓయూకు అవకాశం

పెట్టుబడులతో ఏరోస్పేస్ రంగానికి మరింత బలం

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణలో ఏరోస్పేస్ రంగానికి మరో భారీ పెట్టుబడి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఫ్రాన్స్‌కు చెందిన ప్రముఖ విమాన ఇంజిన్ల తయారీ సంస్థ సఫ్రాన్ రాష్ట్రంలో ఏకంగా రూ.4,000 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి చూపుతోంది. ఇప్పటికే హైదరాబాద్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ సంస్థ మరిన్ని తయారీ యూనిట్లను ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తోంది. ఫ్రాన్స్ పర్యటనలో భాగంగా తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సఫ్రాన్ తయారీ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ సంస్థ ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమావేశమై పెట్టుబడుల విస్తరణపై చర్చించారు. ఈ ప్రతిపాదన కార్యరూపం దాలిస్తే తెలంగాణ విమానయాన, రక్షణ రంగాల్లో మరింత బలమైన తయారీ కేంద్రంగా ఎదిగే అవకాశముంది. ముఖ్యంగా అంతర్జాతీయ కంపెనీలు హైదరాబాద్ వైపు చూస్తుండటం రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి సానుకూల పరిణామంగా భావిస్తున్నారు. భారీ ప్రాజెక్టులతోపాటు నైపుణ్యం కలిగిన యువతకు కొత్త ఉద్యోగ అవకాశాలు ఏర్పడే అవకాశం కూడా ఉంది. ఫ్రాన్స్ లో జరిగిన సమావేశంలో సఫ్రాన్ ప్రతినిధులతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పలు కీలక అంశాలపై చర్చించారు. తెలంగాణలో కొత్త తయారీ కేంద్రాల ఏర్పాటు, ప్రస్తుతం కొనసాగుతున్న కార్యకలాపాల విస్తరణ, భవిష్యత్తులో పెట్టుబడులను పెంచే అవకాశాలపై

మిగతా 3లో..



ఎల్‌నినో ముప్పు..

కరువు నివారణకు ముందస్తు కార్యాచరణ

04

- చెరువుల పూడికతీత, ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రాధాన్యం
- ఆరుతడి పంటల సాగుతో రైతులకు భరోసా
- గ్రామీణ ఉపాధికి పెద్దపీట
- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

06

- కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి
- నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని ఆరు డివిజన్లకు చెందిన 544 మందికి చేయూత పింఛన్ మంజూరు పత్రాల పంపిణీ
- ఇచ్చిన హామీలను అంచెలంచెలుగా అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నాం





గుడుంబా గుట్టుపై పోలీసుల మెరుపుదాడులు

- రెండు తండాలను జల్లెడ పట్టిన ఖాకీలు.. 4 వేల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం
- 50 లీటర్ల నాటుసారా స్వాధీనం.. 50 ద్విచక్ర వాహనాల తనిఖీ
- తెల్లవారుజామునే రంగంలోకి దిగిన పోలీసు బలగాలు
- అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

06

నా పిలుపుతో బంగారం కొనుగోళ్లు తగ్గాయి

- బంగారం కొనుగోళ్లు తగ్గించాలన్న పిలుపుకు ప్రజల స్పందన: మోదీ
- కొనుగోళ్లు తగ్గడంతో పసిడి ధరలు దిగివచ్చాయని వ్యాఖ్య
- ఐటీఐ నైపుణ్యాలకు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న డిమాండ్
- నైపుణ్య కార్మికుల ఉద్యోగాలను ఏఐ లాక్కోలేదని మోదీ
- యూపీలో సెమీకండక్టర్, బ్రహ్మోస్ తయారీపై ప్రశంసలు
- పీఎన్‌జీ కనెక్షన్ల విస్తరణకు ప్లంబర్ల కొరత అడ్డంకి






విశాలభారతి, జాతీయం:

ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ఒక విజ్ఞప్తి దేశవ్యాప్తంగా బంగారం కొనుగోళ్లపై ప్రభావం చూపిందని ఆయన స్వయంగా ప్రకటించడం ఇప్పుడు ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. అత్యవసరమైతే తప్ప బంగారం కొనుగోలు చేయవద్దని ఏడాది క్రితం తాను చేసిన సూచనకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని మోదీ తెలిపారు. ఉత్తరప్రదేశ్ రాజధాని లఖ్‌నవూలో జరిగిన కౌశల్ దీక్షాంత్ సమారోహ్ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రజలు తన మాటను పాటించడం వల్ల పసిడి కొనుగోళ్లు తగ్గాయని, ధరలు దిగిరావడానికి అది దోహదపడిందని ప్రధాని పేర్కొన్నారు. అయితే బంగారం ధరలు తగ్గడానికి అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, డాలర్ విలువ, దిగుమతులు వంటి అనేక అంశాలు కూడా ప్రభావం చూపుతాయి. ఈ నేపథ్యంలో మోదీ వ్యాఖ్యలు ప్రజల పొదుపు అలవాట్లపై ఆయన చేసిన విజ్ఞప్తి ప్రభావాన్ని తెలియజేస్తున్నాయి. తన పిలుపును మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి ఇచ్చిన దేశభక్తి సందేశంతో మోదీ పోల్చడం ఈ ప్రసంగంలో ప్రత్యేకంగా నిలిచింది. దేశంలో ఆహార కొరత ఏర్పడిన సమయంలో శాస్త్రి ప్రజలను వారానికి ఒక రోజు లేదా ఒక పూట భోజనం మానేయాలని కోరిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అప్పట్లో దేశ ప్రజలు ఆ పిలుపుకు స్పందించినట్లే, ఇప్పుడు తన సూచనను కూడా గౌరవించారని మోదీ అన్నారు. సామాన్యుడిగా తాను చేసిన విజ్ఞప్తిని ప్రజలు స్వీకరించడం సంతోషంగా ఉందని, దేశ ప్రజల్లో త్యాగం, బాధ్యత, పొదుపు వంటి లక్షణాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని వ్యాఖ్యానించారు. తన సలహా విని డబ్బు ఆదా చేసుకున్నామని కొందరు చెప్పడం తనకు ఆనందాన్ని కలిగించిందని కూడా తెలిపారు. ఈ వ్యాఖ్యలు ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే రాజకీయ సందేశంగా కనిపిస్తున్నాయి. ఇదే కార్యక్రమంలో నైపుణ్య విద్య, ఉద్యోగ అవకాశాలపై ప్రధాని చేసిన వ్యాఖ్యలు కూడా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కేవలం యూనివర్సిటీ డిగ్రీలు పొందిన వారికే కాకుండా, సాంకేతిక విద్య, చేతివృత్తులు, పారిశ్రామిక శిక్షణలో నైపుణ్యం కలిగిన వారికి ప్రపంచవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉందని మోదీ పేర్కొన్నారు. ముఖ్యంగా ఐటీఐల్లో శిక్షణ పొందిన యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని చెప్పారు. ఒకప్పుడు ఐటీఐ విద్యార్థులను తక్కువగా చూసే సామాజిక ధోరణి ఉండేదని, ఆ ఆలోచనలను మార్చాల్సిన అవసరం ఉందన్నారు. విదేశీ పాలనలో భారతీయ సంప్రదాయ వృత్తులు, నైపుణ్యాలు దెబ్బతిన్నాయని, మెకాలే విద్యా విధానం కార్యాలయ ఉద్యోగుల తయారీకి ప్రాధాన్యం ఇచ్చిందని విమర్శించారు. నేటి పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను యువత నేర్చుకోవడం దేశ ఆర్థిక అభివృద్ధికి కీలకమని ఆయన సందేశమిచ్చారు. ఉత్తరప్రదేశ్‌లో పారిశ్రామిక, రక్షణ రంగాల అభివృద్ధిని కూడా మోదీ ప్రస్తావించారు. రాష్ట్రంలో సెమీకండక్టర్ చిప్ తయారీ కేంద్రం నిర్మాణం జరుగుతోందని, బ్రహ్మోస్ క్షిపణుల తయారీ కూడా యూపీలో కొనసాగుతోందని తెలిపారు. ఇవి రాష్ట్రాన్ని తయారీ రంగంలో ముందుకు తీసుకెళ్లే ప్రాజెక్టులుగా ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, హర్ముజ్ జలసంధి పరిస్థితుల నేపథ్యంలో ఇంధన సరఫరాపై ఆందోళనలు వ్యక్తమైన విషయాన్ని ప్రధాని గుర్తుచేశారు. పెట్రోల్ బంకుల వద్ద క్యూలు, వంటగ్యాస్ కొరత ఏర్పడుతుందని కొందరు భావించినప్పటికీ, అలాంటి పరిస్థితి తలెత్తలేదని ఆయన చెప్పారు. ఇంధన సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, ప్రత్యామ్నాయ వనరులను పెంచడం ప్రభుత్వ ప్రాధాన్యంగా ఉందని ఈ వ్యాఖ్యలు సూచిస్తున్నాయి. ఇంధన అవసరాలను తీర్చేందుకు పైపుల ద్వారా సహజ వాయువు సరఫరా చేసే పీఎన్‌జీ కనెక్షన్లను రోజుకు లక్ష వరకు పెంచాలని నిర్ణయించినట్లు మోదీ వెల్లడించారు. కానీ ప్రస్తుతం రోజుకు 15 నుంచి 20 వేల కనెక్షన్లు మాత్రమే ఇవ్వగలుగుతున్నారని అధికారులు చెప్పినట్లు వివరించారు. దీనికి కారణం తగినంత మంది ప్లంబర్లు, శిక్షణ పొందిన కార్మికులు అందుబాటులో లేకపోవడమేనని తెలిపారు. ఈ ఉదాహరణ ద్వారా నైపుణ్య కార్మికుల కొరత కేవలం ఉద్యోగ సమస్య మాత్రమే కాదని, దేశ మౌలిక సదుపాయాల విస్తరణను కూడా ప్రభావితం చేస్తోందని ప్రధాని వివరించారు. బంగారం కొనుగోళ్ల లోపొదుపు నుంచి ఐటీఐ విద్య, సెమీకండక్టర్ తయారీ, ఇంధన భద్రత వరకు మోదీ ప్రసంగం విస్తరించింది. దేశ అభివృద్ధికి ప్రజల సహకారం, ఆధునిక పరిశ్రమలు, నైపుణ్యంతో కూడిన మానవ వనరులు సమానంగా అవసరమనే సందేశాన్ని ఆయన ఈ కార్యక్రమం ద్వారా ముందుకు తీసుకొచ్చారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

- అర్హులైన ప్రతి కుటుంబానికి బీమా అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



విశాలభారతి, మెదక్: ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంలో అర్హులైన లబ్ధిదారుల నమోదు ప్రక్రియను ఎలాంటి తప్పులకు తావులేకుండా, పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పథకం అమలులో భాగంగా స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో గూగుల్ మీట్ ద్వారా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...అధికారులు ప్రతి లబ్ధిదారుడి వివరాలను సంబంధిత పోర్టల్‌లో జాగ్రత్తగా నమోదు చేయాలని సూచించారు. నమోదు ప్రక్రియలో రేషన్ కార్డు, ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్ నంబర్ కీలకమని, ఈ వివరాలను తప్పనిసరిగా సరిచూసుకోవాలని తెలిపారు.

ఎవరి పేరుపై జీవిత బీమా నమోదు చేయించుకోవాలనుకుంటున్నారో కుటుంబ సభ్యుల నుంచి స్పష్టమైన వివరాలు సేకరించాలని సూచించారు. ఒక కుటుంబంలో ఒక వ్యక్తికి మాత్రమే బీమా పొందే అవకాశం ఉన్నందున అర్హులైన వ్యక్తిని కుటుంబ సభ్యుల సమ్మతితో గుర్తించాలన్నారు. బీమా నమోదు చేసుకునే వ్యక్తి తప్పనిసరిగా నమోదు కేంద్రానికి స్వయంగా హాజరుకావాలని స్పష్టం చేశారు. అదేవిధంగా నామినీ వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని, అన్ని వివరాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే పోర్టల్‌లో నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు. రేషన్ కార్డులో ఒక్క వ్యక్తి మాత్రమే ఉన్న కుటుంబానికి ఈ పథకం కింద బీమా నమోదు చేసుకునే అవకాశం లేదని తెలిపారు. నెల రోజుల వ్యవధిలో బీమా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని, నిర్దేశిత గడువులోగా అర్హులైన లబ్ధిదారులందరి నమోదు పూర్తయ్యేలా స్పెషల్ ఆఫీసర్లు, సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేస్తూ నమోదు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, ముఖ్య ప్రణాళిక అధికారి సురేష్, ఈ డి యం సందీప్ లు పాల్గొన్నారు.

రాజగోపాల్‌రెడ్డికి హైకమాండ్ ఫోన్!

మొదటిపేజీ తరువాయి

రాజకీయాల్లో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. రాజగోపాల్ రెడ్డి ఇటీవల ఓ కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ నాయకత్వానికి ఇబ్బందికరంగా మారాయి. తప్పులను ప్రశ్నించాలంటే ప్రతిపక్షంలోనే ఉండాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. తనకు నిజాలు మాట్లాడే అలవాటు ఉందని, ప్రభుత్వంలో ఉన్నప్పటికీ ప్రజల సమస్యలపై గొంతెత్తుతానని పేర్కొన్నారు. ముఖ్యంగా హైదరాబాద్ అభివృద్ధి ప్రణాళికలను ప్రస్తావిస్తూ ఉన్న సిటీకే సరైన పరిస్థితి లేకపోతే ఫ్యూచర్ సిటీ ఎందుకని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి కొడంగల్ నియోజకవర్గానికి భారీగా నిధులు తీసుకెళ్తున్నారని, మంత్రులు కూడా తమ ప్రాంతాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. కొడంగల్‌కు రూ.20 వేల కోట్లు కేటాయించినా అభ్యంతరం లేదని, కానీ మునుగోడుకు నిధులు అడిగితే పట్టించుకోకపోవడం సరికాదన్నారు. అవసరమైతే మరో కురుక్షేత్రం సృష్టిస్తానని హెచ్చరించారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలన్నదే తమ ఆకాంక్ష అని కూడా స్పష్టం చేశారు. కాంగ్రెస్‌లో నేతల బహిరంగ వ్యాఖ్యలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కీలకంగా స్పందించారు. ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఏఐసీసీ పరిగణనలోకి తీసుకుందని తెలిపారు. క్రమశిక్షణ చర్యలపై తుది నిర్ణయం పార్టీ అధిష్ఠానానిదేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువగా ఉందని వ్యాఖ్యానించారు. గతంలో కొండా సురేఖ విషయంలోనూ తొలిసారి వెంటనే చర్యలు తీసుకోలేదని, రెండు మూడు సందర్భాల్లో జరిగిన పరిణామాల తర్వాత



నిర్ణయం తీసుకున్నామని గుర్తుచేశారు. దీంతో తాజా వివాదంలోనూ హైకమాండ్ ఆచితూచి వ్యవహరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు తెలంగాణకు రావాల్సిన నీటి వాటాపై ఎలాంటి రాజీ ఉండదని మహేశ్ కుమార్ గౌడ్ తేల్చిచెప్పారు. రాష్ట్రానికి చెందాల్సిన ఒక్క నీటి చుక్కను కూడా వదులుకోబోమని, తెలంగాణ ప్రజల ప్రయోజనాలను కాపాడటమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణ కాంగ్రెస్ కొత్త ఇన్‌ఛార్జి బి.ఎం. సందీప్ రాష్ట్ర పర్యటన ఇప్పుడు రాజకీయంగా కీలకంగా మారింది. ఆదివారం హైదరాబాద్ చేరుకోనున్న ఆయన ఈ నెల 22న గాంధీభవన్‌లో జరిగే పొలిటికల్ అఫైర్స్ కమిటీ, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉమ్మడి సమావేశంలో పాల్గొంటారు. తర్వాత 23న ఉదయం రాష్ట్ర మంత్రులతో ప్రత్యేకంగా సమావేశమవుతారు. మధ్యాహ్నం నుంచి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, పీసీసీ అనుబంధ సంఘాల నాయకులతో చర్చలు నిర్వహించనున్నారు. అనంతరం తిరిగి వెళ్లి, ఈ నెల 27న మరోసారి హైదరాబాద్‌కు రానున్నారు. ఆ పర్యటనలో ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో వ్యక్తిగతంగా మాట్లాడాలని నిర్ణయించారు. ముఖ్యంగా జిల్లాలవారీగా పార్టీ పరిస్థితి, ప్రభుత్వ కార్యక్రమాల అమలు, నేతల మధ్య సమన్వయం వంటి అంశాలపై దృష్టి పెట్టనున్నారు. కొత్త ఇన్‌ఛార్జి బాధ్యతలు చేపట్టిన వెంటనే పరుస సమావేశాలు నిర్వహిస్తుండటం కాంగ్రెస్‌లో సంస్థాగత మార్పులకు ప్రాధాన్యం పెరిగిందనే సంకేతాలు ఇస్తోంది. కాంగ్రెస్ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశంలో పార్టీ క్రమశిక్షణ అంశం ప్రధాన చర్చగా మారే అవకాశముంది. ఇటీవల సొంత ప్రభుత్వంపై బహిరంగ విమర్శలు చేస్తున్న నాయకుల వ్యవహారాన్ని హైకమాండ్ సీరియస్‌గా తీసుకున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పార్టీ ప్రతిష్ఠకు ఇబ్బంది కలిగించే వ్యాఖ్యలను నియంత్రించాలని అధిష్ఠానం సూచించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యలపై టీపీసీసీ ఏఐసీసీకి నివేదికలు పంపినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో కొత్త ఇన్‌ఛార్జి బి.ఎం. సందీప్ సంబంధిత నాయకులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకోనున్నారు. ఆ తర్వాత రాష్ట్ర ముఖ్యనేతలతో చర్చించి అధిష్ఠానానికి నివేదిక అందించే అవకాశం ఉంది. పార్టీ పరంగా తదుపరి నిర్ణయాలు ఆ చర్చల ఆధారంగా ఉండనున్నాయి. మునుగోడు అభివృద్ధి నిధుల అంశంతో మొదలైన వివాదం ఇప్పుడు కాంగ్రెస్ అంతర్గత క్రమశిక్షణకు పరీక్షగా మారింది.

సన్న వడ్ల బోనస్‌పై జీవో ఏది?

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణలో ధాన్యం కొనుగోళ్ల జాప్యంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్ రావు తీవ్ర విమర్శలు చేశారు. శనివారం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం పెద్దకోడూరు పరిధిలోని మెట్టు బండల వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ పేరుకుపోయిన వడ్ల రాశులను చూసి రైతులతో మాట్లాడారు. గ్రేడింగ్ పేరుతో సిద్దిపేట జిల్లాలో ఏకంగా 70 కొనుగోలు కేంద్రాలను మూసివేశారని మండిపడ్డారు. వీటిలో 50 ఐకేపీ కేంద్రాలు, 20 ప్యాక్స్ సొసైటీలు ఉన్నాయని తెలిపారు. మౌలిక వసతులు లేవంటూ ఎల్2 గ్రేడ్ కేటాయించి కొనుగోళ్లు నిలిపివేయడం రైతులకు శాపంగా మారిందన్నారు. చిన్నకోడూరు, మాట్ల, నారాయణరావుపేట మండలాలతోపాటు దాదాపు 70 గ్రామాల్లో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. గతంలో వడ్లు కల్లాలకు రాగానే కొనుగోలు చేసేవాళ్లమని, ఇప్పుడు తెరిచిన కేంద్రాల్లోనూ ప్రక్రియ ముందుకు సాగడం లేదని విమర్శించారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి భారీ తేడా ఉందని హరీశ్ రావు వ్యాఖ్యానించారు. గత వానాకాలంలో ఇదే సమయానికి రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొనుగోలు చేశామని గుర్తుచేశారు. ప్రస్తుతం దొడ్డు వడ్ల కొనుగోళ్లు కనీసం లక్ష మెట్రిక్ టన్నులు కూడా దాటలేదని ఆరోపించారు. ఇప్పటివరకు రైస్ మిల్లులకు కేటాయింపులు పూర్తికాకపోవడం, గోదాముల ఏర్పాట్లు జరగకపోవడం రైతులకు సమస్యగా మారిందన్నారు. కొనుగోళ్లు ఆలస్యమైతే రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తుందని, తద్వారా ప్రభుత్వ కొనుగోలు భారం తగ్గుతుందనే ఉద్దేశంతోనే జాప్యం జరుగుతోందని విమర్శించారు. అసలు ఎన్ని కేంద్రాలు పనిచేస్తున్నాయి, ఎంత ధాన్యం కొన్నారు



అనే లెక్కలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. గతేడాది, ఈ ఏడాది కొనుగోళ్లను పోలుస్తూ ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని సవాల్ విసిరారు. ప్రభుత్వ కేంద్రాల్లో కొనుగోళ్ల ఆలస్యమవడంతో రైతులు ఆర్థికంగా భారీగా నష్టపోతున్నారని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. దొడ్డు వడ్లకు ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,461 కాగా, ప్రైవేట్ వ్యాపారులు కేవలం రూ.2,100 చెల్లిస్తున్నారని తెలిపారు. పైగా బస్తాకు రెండు కిలోల తరుగు తీస్తున్నారని, అదే రోజు డబ్బులు కావాలంటే మరో ఒక శాతం కోత పెడుతున్నారని వివరించారు. దీంతో రైతు చేతికి క్వింటాల్‌కు రూ.2,000 కూడా రావడం లేదన్నారు. మద్దతు ధరతో పోలిస్తే ఒక్కో క్వింటాల్‌పై రూ.461 వరకు నష్టం వస్తోందని చెప్పారు. పంట దిగుబడిని బట్టి ఎకరానికి రూ.14 వేల నుంచి రూ.15 వేల వరకు రైతులు కోల్పోతున్నారని పేర్కొన్నారు. సాగు కోసం పెట్టిన పెట్టుబడి, నెలల తరబడి పడిన కష్టం చివరకు ప్రైవేట్ వ్యాపారులకే లాభంగా మారుతోందని విమర్శించారు. పెద్దకోడూరు కొనుగోలు కేంద్రంలో పరిస్థితి రైతుల కష్టాలకు అద్దం పడుతోందని హరీశ్ రావు తెలిపారు. మొత్తం 63 మంది రైతులు ధాన్యం తీసుకొచ్చి రోజుల తరబడి ఎదురుచూస్తుంటే, కేవలం ఆరేడుగురి వడ్లు మాత్రమే తూకం వేశారని చెప్పారు. తేమ శాతం నిబంధనలకు అనుగుణంగా ఉన్న ధాన్యాన్ని కూడా వెంటనే కొనడం లేదని మండిపడ్డారు. మరోవైపు తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే ప్రమాదముందని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో రైతుల్లో ఆందోళన పెరుగుతోందన్నారు. వర్షాలకు కల్లాల్లోని ధాన్యం తడిస్తే మరింత నష్టం తప్పదని పేర్కొన్నారు. కనీసం టార్పాలిన్ కవర్లు కూడా అందించడం లేదని విమర్శించారు. మిల్లులతో ఒప్పందాలు పూర్తిచేసి ధాన్యాన్ని వెంటనే తరలించాలని డిమాండ్ చేశారు. వానాకాలం కొనుగోళ్లపై ముఖ్యమంత్రి, పౌరసరఫరాల శాఖ మంత్రి సమీక్షలు నిర్వహించి వేగంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సన్న వడ్ల బోనస్ విషయంలోనూ ప్రభుత్వం రైతులను అయోమయంలోకి నెట్టిందని హరీశ్ రావు విమర్శించారు. మొదట అన్ని రకాల సన్నాలకు బోనస్ ఇస్తామని చెప్పి, తర్వాత 32 రకాలకు పరిమితం చేశారని తెలిపారు. ఇప్పుడు ఆ సంఖ్యను కేవలం ఏడు రకాలకు తగ్గించారని ఆరోపించారు. వాటికి కూడా ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల కాలేదని, ఇప్పటివరకు సన్న వడ్ల కొనుగోళ్లు ప్రారంభం కాలేదని పేర్కొన్నారు. దీంతో రైతులు బయట మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.2,500 నుంచి రూ.2,600కే అమ్ముకుంటున్నారని వివరించారు. బోనస్‌తో కలిపి రూ.2,961 రావాల్సి ఉండగా క్వింటాల్‌కు రూ.400 నుంచి రూ.500 వరకు నష్టం ఎదురవుతోందన్నారు. వెంటనే బోనస్ జీవో విడుదల చేసి అన్ని రకాల సన్నాలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మూసివేసిన కేంద్రాలను తిరిగి తెరిచి, తుఫాన్ రాకముందే దొడ్డు, సన్న వడ్లన్నింటినీ తూకం వేసి మిల్లులకు తరలించాలని కోరారు.



సీపీఐ ఎఫ్ సెక్షన్ శాఖ నూతన కమిటీ ఎన్నిక

- శాఖ కార్యదర్శిగా ఆవుల నరసింహ ఏకగ్రీవ ఎన్నిక
- పార్టీ బలోపేతానికి క్రమశిక్షణతో పనిచేయాలి: నాయకులు

విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ : రావి నారాయణరెడ్డి కాలనీ ఫేజ్ 3లో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఎఫ్ సెక్షన్ శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కామ్రేడ్ ముత్యాల యాదిరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శి కామ్రేడ్ అజ్మీరా హరిసింగ్ నాయక్, మండల సహాయ కార్యదర్శి కేతరాజు నరసింహ, మండల కార్యవర్గ సభ్యులు పొన్నాల యాదగిరి హాజరై మాట్లాడారు.

ఆవుల నరసింహకు శాఖ కార్యదర్శి బాధ్యతలు

ఈ సందర్భంగా ఎఫ్ సెక్షన్ శాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. శాఖ కార్యదర్శిగా కామ్రేడ్ ఆవుల నరసింహ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మొత్తం 10 మందితో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు. పార్టీ పటిష్టతకు సమష్టి కృషి చేయాలినూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు పార్టీ బలోపేతానికి క్రమశిక్షణతో, అంకిత భావంతో పనిచేయాలని నాయకులు సూచించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

అసమ్మతి జ్వాలలు ఆగేనా?

మొదటిపేజీ తరువాయి

నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కావాలని స్పష్టం చేశారు.నిధుల విషయంలో విపక్ష కొనసాగితే మరో కురుక్షేత్రం తప్పదంటూ ఆయన చేసిన హెచ్చరిక కాంగ్రెస్‌లో రాజకీయ దుమారం రేపింది. అసమ్మతి ఎమ్మెల్యేల విమర్శలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు కొత్త వివాదానికి దారితీశాయి. సిద్దిపేటలో జరిగిన బహిరంగ సభలో విమర్శకులను ఉద్దేశించి సీఎం చేసిన పిచ్చికుక్క లంటూ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్‌లోనే అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి.దీనిపై రాజగోపాల్‌రెడ్డి కూడా ఘాటుగా స్పందించారు. ఉన్నత పదవుల్లో ఉన్నవారు హుందాగా వ్యవహరించాలని, అధికారంలో ఉన్నామనే కారణంతో అహంకారపూరితంగా మాట్లాడకూడదని సూచించారు.అయితే కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తి లేదని ఆయన స్పష్టం చేయడం గమనార్హం. అంటే పార్టీని వదిలిపెట్టకుండా, పార్టీలోనే ఉంటూ ప్రభుత్వ నాయకత్వాన్ని ప్రశ్నించే వైఖరిని ఆయన కొనసాగిస్తున్నట్లు కనిపిస్తోంది. జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు మరో వివాదానికి తెరతీశాయి. ప్రభుత్వ అధికారుల అవినీతి కారణంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని ఆయన ఆరోపించారు.వారసత్వ ఆస్తి బదిలీకి సంబంధించిన ఒక పని కోసం తాను సూచించినా అధికారులు పట్టించుకోలేదని, అదే వ్యక్తి రూ.15 వేల లంచం ఇచ్చిన తర్వాత పని పూర్తయిందని ఆయన పేర్కొన్నారు.అభివృద్ధి పనుల బిల్లుల చెల్లింపునకు 10 నుంచి 20 శాతం వరకు కమీషన్లు డిమాండ్ చేస్తున్నారని కూడా ఆరోపించారు. చిన్న రోడ్డు పనులకు సంబంధించిన బిల్లుల్లోనూ ఇదే పరిస్థితి ఉందని చెప్పారు. కాంగ్రెస్‌లో వివాదాలు కేవలం ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేల మధ్యనే పరిమితం కాలేదు.



మంత్రి దామోదర రాజనర్సింహ, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు మధ్య ఢిల్లీలో చోటుచేసుకున్న వివాదం కూడా పార్టీ నాయకత్వానికి సమస్యగా మారింది. పార్టీ సంస్థాగత పదవుల నియామకాల విషయంలో మొదలైన విభేదాలు తీవ్రస్థాయికి చేరినట్లు వార్తలు వచ్చాయి. ఇరువురి మధ్య సయోధ్య కుదిర్చేందుకు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ప్రయత్నించినప్పటికీ, గాంధీభవన్ సమావేశానికి ఇద్దరూ హాజరుకాలేదు.ఈ వ్యవహారంపై అధిష్ఠానానికి నివేదిక సిద్ధం చేసినట్లు వార్తలు వెలువడ్డాయి. తాజా పరిణామాలను కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. రాజగోపాల్‌రెడ్డి, అనిరుద్‌రెడ్డి వ్యాఖ్యలను అధిష్ఠానం పరిశీలిస్తోందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ వెల్లడించారు. సరైన సమయంలో క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని సంకేతాలిచ్చారు. గతంలో కొండా సురేఖ వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ, కాంగ్రెస్‌లో అందరికీ ఒకే విధమైన నియమాలు వర్తిస్తాయని పేర్కొన్నారు. అయితే అసమ్మతిని క్రమశిక్షణ చర్యలతో అణచివేయాలా? లేక ఎమ్మెల్యేల ఫిర్యాదులను పరిశీలించి సమస్యలను పరిష్కరించాలా? అన్నది నాయకత్వం ముందున్న కీలక ప్రశ్న.మరోవైపు నూతన తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి బీఎం సందీప్‌తో నవంబర్ 23న సమావేశం కావాలని తనకు సమాచారం అందిందని రాజగోపాల్‌రెడ్డి వెల్లడించారు. ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ తనను సంప్రదించినట్లు తెలిపారు. తెలంగాణ కాంగ్రెస్ ముందున్న సమస్య ఇప్పుడు కేవలం ఇద్దరు ముగ్గురు ఎమ్మెల్యేల అసంతృప్తి మాత్రమే కాదు. నిధుల పంపిణీలో సమానత్వం, ప్రభుత్వంలో జవాబుదారీతనం, పార్టీ నాయకుల మధ్య సమన్వయం వంటి అంశాలపై కూడా స్పష్టత ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వానికి అధిష్ఠానం మద్దతు కొనసాగుతున్నప్పటికీ, సొంత పార్టీ నుంచి వస్తున్న విమర్శలను ఎలా ఎదుర్కొంటారన్నది కీలకంగా మారింది.అసమ్మతి నేతలను పిలిపించి బుజ్జగిస్తారా? వారి ఆరోపణలపై విచారణకు ఆదేశిస్తారా? లేక క్రమశిక్షణ చర్యలతో కట్టడి చేస్తారా? అనేది వేచి చూడాల్సిందే.

సీసీ కెమెరాలతో నేరాలకు చెక్ పెట్టవచ్చు

- ప్రతి వార్డులో కెమెరాల ఏర్పాటుకు ప్రజలు ముందుకు రావాలి
- 21వ వార్డులో సీసీ కెమెరాలను ప్రారంభించిన జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు

విశాలభారతి, మెదక్ : మెదక్ పట్టణంలో నేరాల నియంత్రణ, ప్రజల భద్రత కోసం ప్రతి వార్డులో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ అన్నారు. శనివారం మెదక్ పట్టణంలోని 21

విశాల భారతి

చిల్లర రాజకీయాలు మానుకోవాలి

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణ రాజకీయాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై బీజేపీ నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రెండు పార్టీలు ప్రజా సమస్యలను పక్కనపెట్టి రాజకీయ ప్రయోజనాల కోసం వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. శనివారం నిజామాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన, కాంగ్రెస్, బీఆర్ఎస్ చిల్లర రాజకీయాలు మానుకోవాలని సూచించారు. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమంతో ముడిపడిన కుటుంబాలను రాజకీయాల్లోకి లాగడం సరికాదని వ్యాఖ్యానించారు. శ్రీకాంత్ చారి, ఆచారి వంటి వారి కుటుంబ సభ్యుల పేర్లతో రాజకీయాలు చేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ఇదే సమయంలో నిజామాబాద్ జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై ప్రభుత్వ యంత్రాంగం దృష్టి పెట్టాలని సూచించారు. రాజకీయ విమర్శలతోపాటు స్థానిక సమస్యలను కూడా ప్రస్తావించడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును ఆయన ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాత్రపైనా ఎంపీ అరవింద్ విమర్శలు చేశారు. ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన పోరాటంలో రేవంత్ రెడ్డి పాల్గొనలేదని, తెలంగాణ సాధన కోసం ఆయన ఎప్పుడూ పోరాడలేదని ఆరోపించారు. ఉద్యమకారుల త్యాగాలను ఇప్పుడు రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. ముఖ్యంగా శ్రీకాంత్ చారి కుటుంబాన్ని గతంలో బీఆర్ఎస్, ప్రస్తుతం కాంగ్రెస్ రాజకీయంగా ఉపయోగించుకుంటున్నాయని వ్యాఖ్యానించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కూడా అరవింద్ తీవ్ర ఆరోపణలు చేశారు. తనకు సన్నిహితుడైన ఉత్తమ్ కుమార్ రెడ్డి విజయానికి సహకరించే ఉద్దేశంతోనే గతంలో శ్రీకాంత్ చారి తల్లికి హుజూర్‌నగర్ నియోజ



కవర్గం నుంచి టికెట్ ఇచ్చారని పేర్కొన్నారు. ఉద్యమ అమరవీరుల కుటుంబాలకు నిజమైన గౌరవం ఇవ్వకుండా రాజకీయ అవసరాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని మండిపడ్డారు. ఈ వ్యవహారంలో రెండు పార్టీల తీరును ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబ రాజకీయాలపైనా ఎంపీ అరవింద్ విమర్శలు గుప్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత చేసిన త్యాగం ఏమిటని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి ఎదురైన తర్వాత కూడా ఆమెకు ఎమ్మెల్సీ పదవి ఎలా ఇచ్చారని నిలదీశారు. ఉద్యమంలో ప్రాణత్యాగాలు చేసిన కుటుంబాలకు ఒకరకమైన ప్రాధాన్యం, రాజకీయ నాయకుల కుటుంబ సభ్యులకు మరోరకమైన అవకాశాలు కల్పిస్తున్నారని విమర్శించారు. శ్రీకాంత్ చారి కుటుంబాన్ని రాజకీయంగా ఉపయోగించుకోవడం ద్వారా రెండు పార్టీలు ప్రజల భావోద్వేగాలతో ఆడుకుంటున్నాయని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ చరిత్రను రాజకీయ అవసరాలకు అనుగుణంగా మార్చడం సరికాదని పేర్కొన్నారు. ప్రజలు ఎవరు నిజంగా రాష్ట్రం కోసం పనిచేశారో గుర్తించాలని సూచించారు. ఉద్యమకారుల కుటుంబాలకు న్యాయం చేసే అంశంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ వైఖరిని ఆయన ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలతో రాష్ట్ర రాజకీయాల్లో ఉద్యమ వారసత్వంపై చర్చ మరోసారి తెరపైకి వచ్చింది. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ బాధ్యత వహించాలని ఎంపీ అరవింద్ డిమాండ్ చేశారు. ప్రాజెక్టు నిర్మాణంలోనే డిజైన్ లోపాలు ఉన్నాయని, అనేక అంశాల్లో తప్పులు జరిగాయని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను విమర్శిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అవసరమైన మరమ్మతులు చేపట్టకపోవడం సరికాదని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ప్రాణహిత నుంచి చేవెళ్లకు గ్రావిటీ ద్వారా నీటిని తరలించేలా ప్రాజెక్టును రూపొందించాలని భావించారని గుర్తుచేశారు. అయితే తర్వాత ప్రాజెక్టు రూపకల్పన మారడంతో అనేక సమస్యలు వచ్చాయని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టును రాజకీయ ప్రతిష్ఠ కోసం ప్రారంభించి, చివరకు అవినీతి ఆరోపణలతో వివాదాల్లోకి నెట్టారని కేసీఆర్‌పై మండిపడ్డారు. జాతీయ రాజకీయాల్లో పార్టీని విస్తరించేందుకు కూడా ఈ ప్రాజెక్టును ఉపయోగించుకున్నారని ఆరోపించారు. కాళేశ్వరం విషయంలో రెండు పార్టీల వైఖరిని ఆయన తీవ్రంగా విమర్శించారు. తెలంగాణలో రాబోయే రాజకీయ పరిణామాలపై బీజేపీ ఎంపీ అరవింద్ కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ప్రజల్లో ఆదరణ తగ్గుతోందని, భవిష్యత్తులో బీజేపీ భారీ విజయాలు సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీజేపీ సునామీ రావడం ఖాయమని, ఆ ప్రభావంతో రెండు ప్రధాన ప్రత్యర్థి పార్టీలు రాజకీయంగా వెనుకబడతాయని జోస్యం చెప్పారు. ముఖ్యంగా కాళేశ్వరం వంటి ప్రాజెక్టుల నిర్వహణ, ఉద్యమకారుల కుటుంబాల పట్ల వ్యవహరిస్తున్న తీరు, ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ పనితీరును ప్రజలు గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు. నిజామాబాద్ జిల్లాలో తాగునీటి సమస్యలు రాకుండా చూడాలని అధికారులకు మరోసారి సూచించారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమం విషయంలో రాజకీయ పార్టీల పనితీరే భవిష్యత్తు ఎన్నికల్లో కీలకమవుతుందని పేర్కొన్నారు. తెలంగాణలో బీజేపీని మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని ఆయన వ్యాఖ్యల ద్వారా స్పష్టమవుతోంది.



తెలంగాణకు రూ.4,000 కోట్ల పెట్టుబడి

మొదటిపేజీ తరువాయి

ప్రధానంగా దృష్టి పెట్టారు. సఫ్రాన్ ప్రపంచవ్యాప్తంగా విమాన ఇంజిన్లు, వాటి విడిభాగాలు, ఏరోస్పేస్ టెక్నాలజీ రంగాల్లో ప్రత్యేక గుర్తింపు పొందింది. ఇప్పటికే హైదరాబాద్‌లో సంస్థకు పలు తయారీ యూనిట్లు ఉండటం తెలంగాణకు అదనపు బలంగా మారుతోంది. కొత్తగా రూ.4,000 కోట్ల పెట్టుబడి ప్రతిపాదన రావడం వెనుక రాష్ట్రంలో ఉన్న పారిశ్రామిక వాతావరణం, నైపుణ్యం కలిగిన ఉద్యోగులు, విమానయాన రంగానికి సంబంధించిన మౌలిక సదుపాయాలు కీలకంగా ఉండవచ్చు. అంతర్జాతీయ స్థాయిలో పోటీ పెరుగుతున్న సమయంలో ఇలాంటి పెట్టుబడులను ఆకర్షించడం రాష్ట్రానికి ముఖ్యమైన అవకాశంగా మారనుంది. హైదరాబాద్‌లో సఫ్రాన్ ఇప్పటికే నిర్వహిస్తున్న కార్యకలాపాలు ఏరోస్పేస్ రంగంలో నగరానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చాయి. ముఖ్యంగా లీప్ విమాన ఇంజిన్లకు అవసరమైన కీలక విడిభాగాలను ఇక్కడ తయారు చేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ప్రయాణికుల విమానాల్లో ఉపయోగించే ఈ ఇంజిన్ల నిర్వహణకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అవసరం. ఈ నేపథ్యంలో ప్రపంచంలోని అతిపెద్ద లీప్ ఎంఆర్ఓ కేంద్రాల్లో ఒకదాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడం విశేషం. ఎంఆర్ఓ అంటే విమాన ఇంజిన్ల నిర్వహణ, మరమ్మతులు, పూర్తిస్థాయి సాంకేతిక పరీక్షలు నిర్వహించే ప్రత్యేక వ్యవస్థ. ఇలాంటి కేంద్రాలు విమానయాన సంస్థలకు ఎంతో కీలకం. ఇప్పటికే ఈ రంగంలో కార్యకలాపాలు కొనసాగిస్తున్న సఫ్రాన్ మరింత విస్తరణ చేపడితే హైదరాబాద్ అంతర్జాతీయ ఏరోస్పేస్ సరఫరా వ్యవస్థలో తన స్థానాన్ని బలోపేతం చేసుకునే అవకాశముంది. దీనివల్ల స్థానిక విడిభాగాల తయారీ సంస్థలకు కూడా కొత్త వ్యాపార అవకాశాలు ఏర్పడవచ్చు. సఫ్రాన్ ప్రతిపాదించిన రూ.4,000 కోట్ల పెట్టుబడిపై డిసెంబర్‌లో కీలక ముందడుగు పడే అవకాశముంది. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో సంస్థతో అవగాహన ఒప్పందం కుదిరే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సుకు హాజరుకావాలని సఫ్రాన్ ప్రతినిధులను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఒప్పందం కుదిరితే పెట్టుబడుల అమలు, కొత్త యూనిట్ల ఏర్పాటు, తయారీ కార్యకలాపాల విస్తరణపై తదుపరి కార్యాచరణకు మార్గం ఏర్పడుతుంది. అయితే ప్రతిపాదన నుంచి పూర్తిస్థాయి ప్రాజెక్టు అమలు వరకు అనేక దశలు ఉంటాయి. అవసరమైన అనుమతులు, భూమి, మౌలిక సదుపాయాలు, తయారీ ప్రణాళికలు వంటి అంశాలు కీలకంగా మారతాయి. ఈ ప్రక్రియ వేగంగా పూర్తయితే తెలంగాణకు మరో అంతర్జాతీయ పారిశ్రామిక ప్రాజెక్టును ఆకర్షించే అవకాశం లభిస్తుంది. సఫ్రాన్ పెట్టుబడులు కార్యరూపం దాలిస్తే తెలంగాణకు కలిగే ప్రయోజనాలు కేవలం కొత్త ఫ్యాక్టరీల ఏర్పాటుతోనే ఆగిపోవు. ఏరోస్పేస్ రంగంలో తయారీ కార్యకలాపాలు పెరిగితే ఇంజినీరింగ్, ప్రెసిషన్ మ్యానుఫ్యాక్చరింగ్, నాణ్యత నియంత్రణ, సాంకేతిక నిర్వహణ వంటి విభాగాల్లో నైపుణ్యం కలిగిన ఉద్యోగులకు డిమాండ్ పెరుగుతుంది. ముఖ్యంగా మెకానికల్, ఏరోనాటికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ చదివిన యువతకు అవకాశాలు విస్తరించవచ్చు. అంతేకాకుండా భారీ కంపెనీలకు అవసరమైన చిన్న విడిభాగాలను సరఫరా చేసే స్థానిక పరిశ్రమలు కూడా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది. ఇప్పటికే హైదరాబాద్‌లో ఉన్న విమానయాన తయారీ వ్యవస్థకు కొత్త పెట్టుబడులు అదనపు బలాన్ని అందించగలవు. రక్షణ రంగానికి సంబంధించిన అధునాతన తయారీ అవకాశాలు కూడా పెరగవచ్చు. మొత్తంగా సఫ్రాన్ ప్రతిపాదన తెలంగాణను అంతర్జాతీయ ఏరోస్పేస్ తయారీ కేంద్రంగా మరింత బలోపేతం చేసే అవకాశాన్ని తెరపైకి తీసుకొచ్చింది.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవు

కలెక్టర్ హైమావతి

విశాలభారతి, సిద్దిపేట : సిద్దిపేట జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో ఆశించిన స్థాయిలో పురోగతి లేకపోవడంపై జిల్లా కలెక్టర్ కె. హైమావతి అసంతృప్తి వ్యక్తం చేశారు. గృహ నిర్మాణ పనుల్లో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబం సొంతింటి కలను సాకారం చేసుకునేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీవోలు, ఏపీఎంలు, హౌసింగ్ ఏఈలతో పలు అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో జిల్లాను రాష్ట్ర స్థాయిలో ముందువరుసలో నిలిపేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. మంజూరైన ప్రతి ఇంటికి మార్కింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని, రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకుని నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లలో ఎన్ని బేస్‌మెంట్, గోడలు, స్లాబ్, ప్లాస్టరింగ్, ఫినిషింగ్ దశల్లో ఉన్నాయనే వివరాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా దశల్లో లబ్ధిదారులకు అందిన చెల్లింపులు, పెండింగ్ బిల్లులు, నిర్మాణ పురోగతిపై సమీక్షించారు. మంజూరైన ఇళ్లన్నింటినీ 100 శాతం గ్రౌండింగ్ చేసి, నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేసేలా ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. గృహ నిర్మాణాల్లో జాప్యానికి అవకాశం ఇవ్వకుండా క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

సీఎం రేవంత్ రెడ్డి తీరుతోనే ఏపీ జలదోపిడీ

విశాలభారతి, స్టేట్ బ్యూరో:



తెలంగాణ నీళ్ల విషయంలో మరోసారి రాజకీయ వేడి రాజుకుంది. నాగార్జున సాగర్ నీటి పంపకాలపై ఏపీ, తెలంగాణ మధ్య వివాదం ముదురుతున్న వేళ తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యవహారశైలి వల్లే ఆంధ్రప్రదేశ్ జలదోపిడీకి పాల్పడుతోందని ఆమె తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రజాభవన్‌లో చంద్రబాబుకు ఇచ్చిన ఆతిథ్యం నుంచి పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టు వరకు.. ప్రతి అంశాన్ని ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. హైదరాబాద్‌లో శనివారం మీడియాతో మాట్లాడిన కవిత, తెలంగాణ నీటి ప్రయోజనాలు ప్రమాదంలో పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ఇవన్నీ కవిత చేసిన రాజకీయ ఆరోపణలు మాత్రమే. ఈ ఆరోపణలపై సంబంధిత ప్రభుత్వాల అధికారిక స్పందన, ప్రాజెక్టుల వాస్తవ స్థితి కూడా కీలకంగా మారనున్నాయి. కవిత ప్రధానంగా ప్రస్తావించిన అంశం పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టు. సీఎం రేవంత్ రెడ్డి అపెక్స్ కౌన్సిల్ సమావేశం కోసం పట్టుబట్టకుండా, కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో అనధికారిక సమావేశానికి వెళ్లి ఏపీ ప్రాజెక్టుకు అంగీకరించారని ఆమె ఆరోపించారు. చంద్రబాబును ప్రజాభవన్‌కు ఆహ్వానించి, తెలంగాణ నీటి ప్రయోజనాలను గురుదక్షిణగా అప్పగించారని ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యవహారంలో తెలంగాణ ప్రభుత్వం అన్ని ప్రొటోకాల్స్‌ను పక్కన పెట్టిందని విమర్శించారు. అయితే ఒక సమావేశంలో పాల్గొనడం లేదా చర్చలు జరపడం మాత్రమే ప్రాజెక్టుకు అధికారిక అనుమతి ఇచ్చినట్లు నిర్ధారించదు. ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలు, కేంద్ర అనుమతులు, నీటి కేటాయింపులు, అంతర్రాష్ట్ర ఒప్పందాలు వంటి అంశాలను పరిశీలించినప్పుడే అసలు పరిస్థితి స్పష్టమవుతుంది. రాజకీయ ఆరోపణలకు మించి, అధికారిక పత్రాలు ఈ వివాదంలో కీలక ఆధారాలుగా నిలవనున్నాయి. నాగార్జున సాగర్, శ్రీశైలం జలాశయాల విషయంలో కూడా కవిత తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో నీటి పంపకాల సమయంలో ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు అనుకూలంగా వ్యవహరించారని ఆమె పేర్కొన్నారు. శ్రీశైలం నుంచి నీటిని తరలించేందుకు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నిర్మాణాన్ని ప్రస్తావిస్తూ, ఇప్పుడు నాగార్జున సాగర్‌పై కూడా ఏపీ దృష్టి పెట్టిందని ఆరోపించారు. ఇప్పటికే తాగునీటి అవసరాల కోసం 2.8 టీఎంసీల నీటిని తీసుకుంటున్నారని, మరో 1.8 టీఎంసీలను లిఫ్ట్ ద్వారా తరలించే ప్రయత్నం జరుగుతోందని ఆమె అన్నారు. తాగునీటి అవసరాల పేరుతో ప్రారంభమయ్యే ప్రాజెక్టులు తర్వాత పెద్ద మొత్తంలో నీటిని తరలించే సాధనాలుగా మారుతున్నాయని కవిత అభిప్రాయపడ్డారు. అయితే నీటి వినియోగం, కేటాయింపులు, ప్రాజెక్టుల సామర్థ్యం వంటి వివరాలను అధికారికంగా పరిశీలించడం అవసరం. ఈ వివాదంలో తెలంగాణ ప్రభుత్వ వైఫల్యాన్ని కూడా కవిత ప్రశ్నించారు. ఏపీ ప్రభుత్వం తొమ్మిది నెలలుగా అక్రమ ప్రాజెక్టు నిర్మిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం లేదని ఎలా నమ్మాలని నిలదీశారు. సీఎం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రితో పాటు హోంమంత్రి బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారని, అలాంటప్పుడు ఇంటెలిజెన్స్ వ్యవస్థకు ఈ విషయం తెలియకపోవడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ప్రాజెక్టు నిర్మాణం రేవంత్ రెడ్డి సమ్మతితోనే జరుగుతోందని ఆమె ఆరోపించారు. మరోవైపు తెలంగాణకు చెందిన బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు కూడా ఈ అంశంపై స్పందించాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్, కిషన్ రెడ్డి, రఘునందన్ రావు వంటి నేతలు రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. టీడీపీతో బీజేపీకి ఉన్న రాజకీయ సంబంధాల కారణంగా తెలంగాణ ప్రయోజనాలు పక్కన పడకూడదని కవిత స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్‌లో భాగంగా ఏపీ ప్రాజెక్టుకు 50 శాతం నిధులు అందిస్తోందని కవిత చేసిన ఆరోపణ కూడా ఈ వివాదంలో మరో కీలక అంశంగా మారింది. ఆ నిధులను నిలిపివేయాలని, ప్రాజెక్టును వెంటనే ఆపేందుకు కేంద్రం చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు, ఎంపీలకు వారం రోజుల గడువు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఆలోగా పల్నాడు వాటర్ గ్రిడ్ ప్రాజెక్టును నిలిపివేయించకపోతే తెలంగాణ రక్షణ సేన వేలాది మంది ప్రజలతో నాగార్జున సాగర్ డ్యాంను ముట్టడిస్తుందని హెచ్చరించారు. ఈ హెచ్చరికతో నీటి వివాదం రాజకీయ విమర్శల స్థాయి నుంచి ప్రజా ఉద్యమం దిశగా వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. తెలంగాణ నీటి హక్కుల పరిరక్షణ పేరుతో కవిత చేస్తున్న పోరాటం ఎంతవరకు ముందుకు సాగుతుంది, ప్రభుత్వం ఈ ఆరోపణలకు ఎలాంటి సమాధానం ఇస్తుంది, కేంద్రం ప్రాజెక్టుపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది అన్నది ఇప్పుడు కీలకంగా మారింది. చివరికి ఈ వివాదంలో రాజకీయ ప్రకటనలకంటే నీటి లెక్కలు, చట్టపరమైన అనుమతులు, అధికారిక నిర్ణయాలే తెలంగాణ ప్రయోజనాలను నిర్ధారించనున్నాయి.

నాటుసారా విక్రయాలపై ఎక్సైజ్ శాఖ ఉక్కుపాదం

- **మహబూబాబాద్‌లో మూడు ప్రాంతాల్లో ముమ్మర దాడులు.. మహిళ పట్టివేత**
- **5 లీటర్ల నాటుసారా స్వాధీనం.. తహసీల్దార్ ఎదుట బైండోవర్**

మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్: జిల్లాలో నాటుసారా తయారీ, విక్రయాలు, అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ఎక్సైజ్ శాఖ అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా మహబూబాబాద్ మండలంలోని మూడుకొట్ల సెంటర్, బాబు నాయక్ తండా, అయోధ్య గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో బొమ్మగాని సామ్రాజ్యం అనే మహిళ నాటుసారాతో పట్టుబడింది. ఆమె వద్ద నుంచి 5 లీటర్ల నాటుసారాను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆమెపై కేసు నమోదు చేసి, మహబూబాబాద్ తహసీల్దార్ ఎదుట హాజరుపరిచి బైండోవర్ చర్యలు చేపట్టారు.

అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు.


నాటుసారా తయారీ, విక్రయాలు, రవాణా వంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ రాంప్రసాద్ హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే నాటుసారా వ్యాపారాలకు సహకరించేవారిని కూడా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. గ్రామాల్లో ఎక్కడైనా నాటుసారా తయారీ లేదా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే ప్రజలు వెంటనే ఎక్సైజ్ అధికారులకు తెలియజేయాలని కోరారు. అక్రమ మద్యం నిర్మూలనకు ప్రజలు అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు శ్రీనివాస్, సంతోష్, కానిస్టేబుళ్లు నాగరాజు, విజయ్, జాన్ పాషా, గోపి పాల్గొన్నారు.




ఓఆర్ఆర్‌పై మృత్యుఘోష.. వరుసగా నాలుగు కార్లు ఢీ

- **ఇద్దరికి కాళ్లు విరిగి తీవ్ర గాయాలు.. మరో ఇద్దరి పరిస్థితి విషమం**

రాజేంద్రనగర్, విశాల భారతి :






జెటర్ రింగ్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓఆర్ఆర్‌పై నాలుగు కార్లు వరుసగా ఒకదానికొకటి ఢీకొనడంతో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంతో అటుగా ప్రయాణిస్తున్న వాహనదారులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. అందిన సమాచారం ప్రకారం.. ఓఆర్ఆర్‌పై ప్రయాణిస్తున్న నాలుగు కార్లు వరుసగా ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఇద్దరికి కాళ్లు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదంలో గాయపడిన వారిని వెంటనే అంబులెన్సుల ద్వారా సమీప ఆసుపత్రులకు తరలించి వైద్య చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ప్రమాదం కారణంగా ఓఆర్ఆర్‌పై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సుమారు రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించడంతో పాటు ప్రమాదానికి గురైన వాహనాలను రహదారిపై నుంచి తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే చర్యలు చేపట్టారు. నాలుగు కార్లు ఒకేసారి ప్రమాదానికి గురికావడంతో వాహనాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు, క్షతగాత్రుల పూర్తి వివరాలు పోలీసుల విచారణ అనంతరం వెల్లడికానున్నాయి.

మంత్రి ఓఎస్డీ పేరుతో భారీ మోసం

మొదటిపేజీ తరువాయి

టీచర్, మున్సిపల్ అటెండర్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్, రికార్డ్ అసిస్టెంట్ వంటి ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని అభ్యర్థులను సంప్రదించారు. సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి అధికారిక నోటిఫికేషన్లు, పరీక్షలు, ఎంపిక ప్రక్రియ ఉంటాయి. కానీ నిందితులు తమకు ఉన్నతాధికారులతో పరిచయాలు ఉన్నాయని చెప్పి నేరుగా నియామకాలు చేయిస్తామని నమ్మించారు. ఇందుకోసం నకిలీ ఓఎస్డీ ఐడీ కార్డుతోపాటు ప్రభుత్వ నియామక పత్రాలను ఉపయోగించారు. అంతేకాకుండా నిజమైన ప్రభుత్వ వెబ్‌సైట్ల మాదిరిగా కనిపించే డిజిటల్ పోర్టల్స్ రూపొందించి అభ్యర్థులకు చూపించారు. దీంతో కొందరు యువత ఉద్యోగం వస్తుందనే ఆశతో భారీ మొత్తంలో డబ్బులు ఇచ్చారు. నలుగురు బాధితుల నుంచి వసూలు చేసిన మొత్తం రూ.50.87 లక్షలకు చేరడం ఈ మోసం తీవ్రతను చూపిస్తోంది. డబ్బులు ఇచ్చిన తర్వాత ఉద్యోగ నియామకాలు జరగకపోవడంతో బాధితులు పలుమార్లు నిందితులను సంప్రదించేందుకు ప్రయత్నించారు. అయితే కాలం గడుస్తున్నా ఉద్యోగాలు రాకపోవడంతో చివరకు నేరుగా ఐటీ మంత్రి కార్యాలయానికి వెళ్లారు. అక్కడ తాము చెల్లించిన డబ్బులు, ఉద్యోగాల పేరుతో ఇచ్చిన పత్రాల గురించి వివరించారు. దీంతో మంత్రి కార్యాలయం పేరును ఉపయోగించి మోసం



జరిగిన విషయం బయటపడింది. ఈ ఘటనపై పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నకిలీ ఓఎస్డీ పేరుతో నిరుద్యోగులను మోసం చేసిన వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని కోరారు. ముఖ్యంగా డబ్బుల లావాదేవీలు, నకిలీ ప్రభుత్వ వెబ్‌సైట్లు, నియామక ఉత్తర్వులు, డిజిటల్ ఆధారాలను గుర్తించడంపై పోలీసులు దృష్టి పెట్టారు. బాధితుల నుంచి నగదు ఏ విధంగా వసూలు చేశారు, ఆ మొత్తాన్ని ఎక్కడికి తరలించారు అనే అంశాలపై విచారణ ప్రారంభించారు. పోలీసుల విచారణలో ఈ మోసానికి సంబంధించి ఇద్దరి పేర్లు ప్రధానంగా బయటకు వచ్చాయి. హైదరాబాద్‌లోని రామంతపూర్‌కు చెందిన కొలుగూరి రవికిరణ్, మీ సేవ నిర్వాహకుడు గుంటూరు రవికుమార్ ఈ వ్యవహారంలో నిందితులుగా గుర్తించినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు వెల్లడించారు. వీరు నలుగురితోనే కాకుండా ఇదే విధానంలో మరో ఎనిమిది మందిని కూడా ప్రభుత్వ ఉద్యో

ఎల్‌నినో ముప్పు.. కరువు నివారణకు ముందస్తు కార్యాచరణ

- చెరువుల పూడికతీత, ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రాధాన్యం
- ఆరుతడి పంటల సాగుతో రైతులకు భరోసా
- గ్రామీణ ఉపాధికి పెద్దపీట
- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి
- మీడియా సమావేశంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ వెల్లడి.

మహబూబాబాద్ జిల్లా
విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్



వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో పెట్టుకుని జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలకు సిద్ధమవుతోంది. కరువు ముప్పును అధిగమించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పన, నీటి వనరుల సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులకు సూచించారు. శనివారం మీడియా ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు, కరువు నివారణ చర్యలు, రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై చేపడుతున్న కార్యాచరణను వివరించారు.

కరువు నివారణకు ముందస్తు చర్యలు.

ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం లోటు ఏర్పడే అవకాశాలు ఉన్న నేపథ్యంలో నీటి సంరక్షణకు ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడం, వర్షపు నీటిని ఒడిసిపట్టడం, భూగర్భ జలాలను అభివృద్ధి చేయడం వంటి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కరువు పరిస్థితులు ఏర్పడిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే నివారణ చర్యలు చేపట్టడం ద్వారా రైతులకు, గ్రామీణ ప్రజలకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు.

చెరువుల పూడికతీతకు ప్రాధాన్యం.

గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో పూడికతీత పనులు చేపట్టి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలని కలెక్టర్ సూచించారు. పూడిక తొలగించడం ద్వారా వర్షపు నీటిని ఎక్కువ కాలం నిల్వ చేసుకోవడంతో పాటు భూగర్భ జలాల పెరుగుదలకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ పనులను బీబీజీ రామ్‌జీ పథకం కింద ఉపాధి హామీ పనులతో అనుసంధానం చేసి, గ్రామీణ కూలీలకు ఉపాధి కల్పిస్తూ గ్రామాలకు ఉపయోగపడే శాశ్వత ఆస్తులను నిర్మించాలని పేర్కొన్నారు.

ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన.

ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ రంగానికి ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు వ్యవసాయ, ఉద్యానవన శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. తక్కువ నీటితో సాగు చేయగల చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజల పంటల వైపు రైతులను ప్రోత్సహించాలని సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక, విత్తనాల ఎంపిక, పంట మార్పిడి విధానాలపై వ్యవసాయ అధికారులు రైతులకు సలహాలు అందించాలని పేర్కొన్నారు. పొలాల్లో తేమ నిల్వ ఉండేందుకు పంట అవశేషాలతో మల్చింగ్, ఫామ్ పాండ్లు, ఇంకుడు గుంతల నిర్మాణం, వర్షపు నీటి నిల్వ చర్యలను ప్రోత్సహించాలని తెలిపారు. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసుకునేందుకు డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతులపై అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయ, ఉద్యానవన శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పర్యటించి నేల స్వభావం, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు, చీడపీడల నివారణపై రైతులకు సాంకేతిక సలహాలు అందించాలని పేర్కొన్నారు.

ఇంకుడు గుంతలతో భూగర్భ జలాల పెంపు.

వర్షపు నీరు వృథాగా వెళ్లకుండా ఇళ్ల వద్ద, ప్రభుత్వ భవనాల ప్రాంగణాల్లో ఇంకుడు గుంతలు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. నీటి సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించి ప్రతి ఒక్కరినీ ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని అధికారులకు సూచించారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమాతో భరోసా.

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యమని కలెక్టర్ వివరించారు. అర్హుల వివరాల సేకరణ, దరఖాస్తుల స్వీకరణ, ధ్రువీకరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం ప్రయోజనాలు అందేలా సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.

పారిశుద్ధ్యంపై నిరంతర పర్యవేక్షణ.

గ్రామాల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, చెత్త నిర్వహణ, మురుగునీటి పారుదల వ్యవస్థలను మెరుగుపరచాలని కలెక్టర్ తెలిపారు. వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగం, నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించాలని, బహిరంగ మలవిసర్జనకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణానికి అధికారులు, ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ప్రజలకు చేరువ చేయాలి..

మీడియాకు కలెక్టర్ విజ్ఞప్తి.

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో మీడియా ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ కోరారు. గ్రామీణ ఉపాధి, కరువు నివారణ, నీటి సంరక్షణ, ఆరుతడి పంటల సాగు, కుటుంబ జీవిత బీమా, పారిశుద్ధ్య కార్యక్రమాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, రైతుల సంక్షేమం, ప్రకృతి వనరుల పరిరక్షణకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ స్పష్టం చేశారు.

గుండెపూడిలో మల్లయ్య గౌడ్ కుటుంబానికి సత్యవతి రాథోడ్ పరామర్శ

- చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు.. కుటుంబ సభ్యులకు ఓదార్పు



డోర్నకల్ విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్: డోర్నకల్ నియోజకవర్గంలోని మరిపెడ మండలం గుండెపూడి గ్రామానికి చెందిన లింగాల మల్లయ్య గౌడ్ మృతి పట్ల మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ సంతాపం వ్యక్తం చేశారు. శనివారం గుండెపూడిలోని ఆయన నివాసానికి చేరుకున్న సత్యవతి రాథోడ్.. మల్లయ్య గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కుటుంబ పెద్దను కోల్పోయిన బాధాకర సమయంలో వారికి ధైర్యం చెప్పారు. మల్లయ్య గౌడ్ మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్‌పర్సన్ కుమారి బిందు ఆంగోత్, బోడ శ్రీను నాయక్, కొంపల్లి వేణుగోపాల్ రెడ్డి, షేక్ యాకూబ్ పాషా, లింగాల మహేష్ గౌడ్, పసునూటి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మకు ఎమ్మెల్సీతో పాటు మంత్రి పదవి ఇవ్వాలి

- తుమ్మల నాగరాజు రెడ్డి బిఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షులు



చిట్యాల విశాల భారతి: డిసెంబర్ 9న సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధి నిరూపించుకోవాలి: బిఆర్ఎస్ పార్టీ యువజన సంఘం చిట్యాల మండల అధ్యక్షులు తుమ్మల నాగరాజు రెడ్డి డిమాండ్తె లంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి కల్పించడంతో పాటు రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పించాలని తెలంగాణ ఉద్యమకారుడు, బిఆర్ఎస్ యువజన సంఘం చిట్యాల మండల అధ్యక్షులు తుమ్మల నాగరాజు రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శంకరమ్మకు ఎమ్మెల్సీ ఎందుకు ఇవ్వలేదు, మంత్రి పదవి ఎందుకు కల్పించలేదు అని పదేపదే ప్రశ్నించడం కంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న ఎమ్మెల్సీ స్థానాన్ని ఆమెకు కేటాయించి, మంత్రివర్గంలోకి తీసుకోవాలని అన్నారు. తద్వారా తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుడి కుటుంబానికి సముచిత గౌరవం ఇచ్చినట్లవుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధినేత్రిగా భావించే సోనియాగాంధీ జన్మదినమైన డిసెంబర్ 9వ తేదీనైనా అమరుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మకు ఎమ్మెల్సీ పదవి కల్పించి, మంత్రి పదవి ఇచ్చి తెలంగాణ సమాజం ముందు కాంగ్రెస్ ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు. అదేవిధంగా డిసెంబర్ 9న తెలంగాణ ఉద్యమకారులకు ఇస్తామని ప్రకటించిన ఇంటి స్థలాల పట్టాలను అందజేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు నెలవారీ పింఛన్, ఆర్థిక సహాయం, ఉపాధి అవకాశాల కల్పనపై స్పష్టమైన ప్రకటన చేసి, ఆ రోజే వాటిని అమలు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని తుమ్మల నాగరాజు రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు.

రైల్వే స్టేషన్లపై పోలీసుల డేగకన్ను..

- అనుమానితుల కదలికలపై నిఘా
- మహబూబాబాద్, కేసముద్రం స్టేషన్లలో విస్తృత తనిఖీలు
- గంజాయి అక్రమ రవాణా కట్టడికి ప్రత్యేక చర్యలు
- వాహనాలు, లగేజీ, దుకాణాల పరిశీలన





మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్: జిల్లాలో నేరాల నియంత్రణకు పోలీసులు నిఘా వ్యవస్థను మరింత కట్టుదిట్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా విజిబుల్ పోలీసింగ్‌ను విస్తృతం చేస్తూ మహబూబాబాద్, కేసముద్రం రైల్వే స్టేషన్ల పరిసరాల్లో ముమ్మర తనిఖీలు చేపట్టారు. రైల్వే స్టేషన్లలో అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులు, నేర చరిత్ర కలిగిన వారి కదలికలపై ప్రత్యేక దృష్టి సారించారు. పోలీసు బృందాలు ప్రయాణికుల కదలికలను పరిశీలిస్తూ అనుమానం కలిగించిన వ్యక్తులను ప్రశ్నిస్తున్నాయి. అవసరమైన చోట ఫింగర్‌ప్రింట్ పరికరాల ద్వారా వివరాలను సేకరించి పరిశీలిస్తున్నాయి. ముఖ్యంగా రైల్వే మార్గాల ద్వారా గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నారు. రైళ్లలో ప్రయాణించే అనుమానితులతో పాటు వారి లగేజీని సైతం క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. స్టేషన్ల పరిసరాల్లో రోజుల తరబడి పార్కింగ్ చేసి వదిలేసిన వాహనాల వివరాలను సేకరిస్తూ వాటి యజమానుల ఆచూకీపై ఆరా తీస్తున్నారు. స్టేషన్ సమీపంలోని దుకాణాలు, వ్యాపార సముదాయాలను కూడా తనిఖీ చేస్తూ అనుమానాస్పద కార్యకలాపాలపై నిఘా పెట్టారు. ఆకస్మిక తనిఖీలు, నిరంతర పెట్రోలింగ్‌తో నేరాలకు అవకాశం లేకుండా చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో నేరాల నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్, నిరంతర పెట్రోలింగ్, ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ ఐపీఎస్ స్పష్టం చేశారు. ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు.

2బీహెచ్‌కే ఇళ్ల కేటాయింపుల్లో చేతివాటం.. వార్డు ఆఫీసర్‌పై వేటు!

- లబ్ధిదారుల నుంచి డబ్బుల వసూళ్లు రుజువు
- జె.మీనేశ్వర్‌ను సస్పెండ్ చేసిన కలెక్టర్ స్నేహ శబరిష్



మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్: పేదల సొంతింటి కలను ఆసరాగా చేసుకుని ప్రభుత్వ పథకాల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడితే సహించేది లేదని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ స్పష్టం చేశారు. రెండు పడకల గదుల ఇళ్ల కేటాయింపులో లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు నిర్ధారణ కావడంతో తొర్రూరు పట్టణానికి చెందిన వార్డు ఆఫీసర్ జె.మీనేశ్వర్‌పై సస్పెన్షన్ వేటు వేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో అక్రమాలకు పాల్పడే ఉద్యోగులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. తొర్రూరు పట్టణంలోని 1, 9వ వార్డులకు వార్డు ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న జె.మీనేశ్వర్ రెండు పడకల గదుల ఇళ్ల కేటాయింపు వ్యవహారంలో లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు విచారణలో రుజువైంది. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన జిల్లా యంత్రాంగం ప్రభుత్వ నిబంధనల మేరకు ఆయనను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ చర్యలు తీసుకుంది. ఈ విషయాన్ని కలెక్టర్ శనివారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు.

అక్రమ వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవు

ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అమలు చేస్తున్న రెండు పడకల గదుల ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్లు, ఇతర సంక్షేమ పథకాల పేరుతో లబ్ధిదారుల నుంచి ఎవరైనా డబ్బులు డిమాండ్ చేసినా, వసూలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ప్రభుత్వ పథకాలు ఇప్పిస్తామంటూ మాయమాటలు చెప్పే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా డబ్బులు అడిగితే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజలకు సేవలందించాల్సిన ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, విధి నిర్వహణలో నిస్పార్థం, పారదర్శకత పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పేదలకు అందాల్సిన ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అక్రమ వసూళ్లకు అడ్డాగా మార్చుకునే వారిపై ఉపేక్ష ఉండదనే సంకేతాన్ని ఈ సస్పెన్షన్ చర్య ఇచ్చింది.

ప్రతి కుటుంబానికి భరోసా..



- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా
- ఇంటింటికీ వెళ్లి పథకంపై విస్తృత ప్రచారం చేస్తున్న సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్ (సామి
- ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన
- కార్యక్రమంలో పాల్గొన్న బయ్యారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జూలకంటి సీతారాం రెడ్డి.

బయ్యారం విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్

ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై గంధంపల్లి-కొత్తపేట గ్రామపంచాయతీ సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్ (సామి) ప్రత్యేక దృష్టి సారించారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి పథకం ప్రాధాన్యతను వివరిస్తూ ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. గ్రామపంచాయతీ పాలకవర్గం, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ, ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాల మేరకు గ్రామస్థాయిలో ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంతో పాటు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇతర సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు తెలియజేస్తూ వారి సమస్యలు, సందేహాలను నేరుగా అడిగి తెలుసుకుంటున్నారు. అర్హులైన ప్రతి కుటుంబం ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశంతో గ్రామపంచాయతీలోనే ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకునేందుకు అందుబాటులో ఏర్పాట్లు చేసినట్లు సర్పంచ్ ప్రవీణ్ నాయక్ తెలిపారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకునేలా సహకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బయ్యారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జూలకంటి సీతారాం రెడ్డి పాల్గొని ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలోని ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు సమన్వయంతో ముందుకు సాగుతున్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలి



- ప్రతి మత్స్యకార కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందించాలి
- 50 ఏళ్లు నిండిన వారికి ఆసరా పింఛన్లు మంజూరు చేయాలి
- ప్రపంచ మత్స్యకార దినోత్సవంలో నాయకుల డిమాండ్

మహబూబాబాద్ జిల్లా
విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్.

జిల్లాలో ఎల్‌నినో ప్రభావంతో చెరువులు ఎండిపోవడంతో మత్స్యకారుల జీవనోపాధి తీవ్రంగా దెబ్బతిన్నదని, ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్న మత్స్యకార కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని మత్స్యకార సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రతి మత్స్యకార కుటుంబానికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మహబూబాబాద్ కలెక్టరేట్‌లోని జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని నిర్వహించారు. మత్స్యశాఖ ఇన్‌స్పెక్టర్ దామెర శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా చీఫ్ ప్రమోటర్ కొత్తూరు రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. జిల్లాలో వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంతో చెరువుల్లో నీరు లేకపోవడం మత్స్యకారుల ఉపాధిపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. చేపల పెంపకం, విక్రయాలపై ఆధారపడి జీవించే కుటుంబాలు ఆదాయం కోల్పోయి ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం మత్స్యకారుల పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ప్రతి కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందించి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. 50 సంవత్సరాలు నిండిన మత్స్యకారులకు ఆసరా పింఛన్లు మంజూరు చేయాలని, ఉచిత చేప పిల్లల పంపిణీ పథకంలో నగదుకు బదులుగా మత్స్యకారులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తక్కువ విస్తీర్ణంలో భూములు కలిగిన మత్స్యకారులు సైతం తమ స్థలాల్లో చేపల చెరువులు ఏర్పాటు చేసుకునేలా నిబంధనలను సడలించి ప్రభుత్వం ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొడుగు శ్రీనివాస్ మాట్లాడుతూ.. జిల్లాలో 10 ఎకరాల విస్తీర్ణంలో స్థలాన్ని కేటాయించి మత్స్యశాఖ ఆధ్వర్యంలో అధునాతన ఫిష్ కల్చర్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఆధునిక చేపల పెంపకం విధానాలను అందుబాటులోకి తీసుకొచ్చి మత్స్యకారులకు శాశ్వత జీవనోపాధి కల్పించే దిశగా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అన్నారు. సంప్రదాయ చేపల వేటకే పరిమితం కాకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేపల ఉత్పత్తిని పెంచుకునే అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మత్స్యకారుల సంక్షేమం, ఆర్థిక భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ వారి సమస్యలను పరిష్కరించాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు చిల్లా సహదేవ్ ముదిరాజ్, పిట్టల ధనుంజయ, పెద్ది సైదులు, పిడుగు వెంకన్న, నగేష్, బాసణబోయిన ఎంకన్న, సైదులుతో పాటు వివిధ మండలాలకు చెందిన మత్స్యకారులు పాల్గొన్నారు.

తూర్పు తండాలో నాటుసారా విక్రేత అరెస్టు

- 5 లీటర్ల నాటుసారా స్వాధీనం.. 100 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం
- అక్రమ నాటుసారా విక్రయాలపై ప్రత్యేక నిఘా: కురవి ఎస్సై బి. సతీష్





కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్; కురవి మండలం తూర్పు తండాలో నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి ఐదు లీటర్ల కాచిన నాటు సారాను స్వాధీనం చేసుకోవడంతో పాటు, సారా తయారీకి సిద్ధంగా ఉంచిన సుమారు 100 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. శనివారం సాయంత్రం 4.45 గంటలకు ఏఎస్ఐ జెడ్. ఆదినారాయణ, పోలీసు సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా తూర్పు తండాకు చెందిన అజ్మీర శ్రీనివాస్ (38), తండ్రి రాములు, నాటుసారా విక్రయిస్తున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి రూ.2 వేల విలువైన ఐదు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. సుమారు 100 లీటర్ల బెల్లం పానకాన్ని అక్కడికక్కడే ధ్వంసం చేశారు. ఈ ఘటనపై క్రైమ్ నంబర్ 248/2026 కింద తెలంగాణ స్టేట్ ప్రొహిబిషన్ యాక్ట్ సెక్షన్ 7(ఎ) రెడ్‌విత్ 8(ఈ) ప్రకారం కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టినట్లు కురవి ఎస్సై బి. సతీష్ తెలిపారు.

బాలల స్వపరి పాలన దినోత్సవం




మోతె నవంబర్ 21విశాల భారతి: శనివారం మండల కేంద్రంలో శ్రీ శాంతిని కేతన్ పాఠశాల లొ విద్యార్థిని విద్యార్థులు ఒక్క రోజు ఉపాధ్యాయులు గా అధికారులు గా వేశాధారణ లొ ప్రతిభ కనపర్చారు డి ఇ ఓ గా బానోతు నేహా శ్రీ , యం ఇ ఓ గా కుంచం లోక్షిత్ , కరస్పండెంట్ గా దోసపాటి తన్విష్ , ప్రిన్సిపాల్ గా రాగిరు రుత్విక్ , డైరెక్టర్ గా బానోతు దీక్షిత్ పాలుపంచుకున్నారు ఈ కార్యక్రమం లొ కరస్పండెంట్ దోసపాటి యల్లయ్య డైరెక్టర్ ఉప్పల గోపి చంద్ ప్రిన్సిపాల్ దోసపాటి గోవర్ధన్ ఉపాధ్యాయులు రాధిక సుజాత హామీద సరిత సాధిక రాజేశ్వరి స్వర్ణలత ప్రమీల తదితరులు పాల్గొన్నారు

వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్



మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్: మహబూబాబాద్ నియోజకవర్గ పరిధిలోని గడ్డిగూడెం గ్రామంలో జరిగిన వివాహ వేడుకకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యవతి రాథోడ్ హాజరయ్యారు. మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి మాజీ సూపరింటెండెంట్ వెంకట్రాములు కుమారుడి వివాహ వేడుకలో పాల్గొన్న ఆమె నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఆనందాలతో నిండాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ మాజీ జడ్పీ చైర్‌పర్సన్ బిందు అంగోత్, మాజీ మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, బోడ శ్రీనునాయక్, శారదా జగదీష్ నాయక్, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

అకాల మరణం కార్మిక వర్గానికి తీరనిలోటు



నిజామాబాద్, విశాలభారతి: నిజాంబాద్ జిల్లా నాగారం నివసిస్తున్న ఐఎఫ్టియు జిల్లా ఉపాధ్యక్షులు శివరాజ్ ప్రభుత్వ ఆసుపత్రిలో గుండె కూడుతూ మరణించడం కార్మిక వర్గానికి కార్మిక వర్గానికి తీరని లోటుని ఐఎఫ్టీయూ జిల్లా సహాయ కార్యదర్శి దుడ్డు గంగాధర్ అన్నారు ఆయన మాణిక్ బండ ర్ చెక్క దగ్గర విలేకరులతో మాట్లాడుతూ కార్మికుల కోసం అనేక పోరాటాలు చేసిన వ్యక్తిని ఆయన అన్నారు కామ్రేడ్ శివరాజు ఆశయాలను లక్ష్యాలను సాధించేందుకు ప్రతి ఒక్క కార్మికుడు కోరుతున్నది దోపిడి పీడన లేని సమ సమాజాన్ని సాధించేందుకు కృషి చేయాలని కోరారు వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని సానుభూతి తెలియజేస్తూ ఐఎఫ్టియు జిల్లా కమిటీ ఆయనకు ఆయనకు విప్లవ జోహార్ అర్పిస్తుంది

మాటలతో కాదు.. చేతలతో అభివృద్ధి చాటుతున్న సర్పంచ్

- 11 నెలల్లోనే బంచరాయితండ రూపురేఖలు మార్చే దిశగా కమ్లి పూల్య నాయక్ అడుగులు
- గ్రామ ప్రగతే ధ్యేయంగా ముందుకు
- విమర్శలకు అభివృద్ధి పనులతోనే సమాధానం
- గ్రామపంచాయతీ భవనం, డ్వాక్రా మహిళా సంఘ భవన నిర్మాణాలకు శ్రీకారం

కురవి, విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్:



గ్రామానికి సేవ చేయాలనే సంకల్పం ఉండాలి.. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలనే పట్టుదల ఉండాలి.. అభివృద్ధి సాధించాలనే చిత్తశుద్ధి ఉంటే తక్కువ సమయంలోనే మార్పుకు నాంది పలకవచ్చని బాంచరాయితండ సర్పంచ్ బాధావత్ కమ్లి పూల్య నాయక్ తన పనితీరుతో నిరూపిస్తున్నారు. పదవిని అలంకారంగా కాకుండా బాధ్యతగా భావిస్తూ, గ్రామ అభివృద్ధినే ప్రధాన లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగుతున్నారు. బాధ్యతలు చేపట్టిన కేవలం 11 నెలల వ్యవధిలోనే గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి తనదైన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా గ్రామపంచాయతీకి సొంత భవనం నిర్మించాలనే లక్ష్యంతో పనులు చేపట్టారు. అదేవిధంగా గ్రామంలోని డ్వాక్రా మహిళా సంఘాలకు శాశ్వత వేదిక కల్పించాలనే ఉద్దేశంతో మహిళా సంఘ భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. వీటితో పాటు పిల్లర్ గుంతల తవ్వకం పనులు సైతం చేపట్టి అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారు. కేవలం 11 నెలల్లోనే ఈ పనులకు కార్యరూపం ఇవ్వడం ఆమె కార్యదక్షతకు నిదర్శనంగా నిలుస్తోంది.

పదవి కోసం కాదు.. ప్రజల కోసం పనిచేస్తా!

అనే నిబద్ధతతో ముందుకు సాగుతున్న కమ్లి పూల్య నాయక్‌కు విమర్శలు, అడ్డంకులు ఎదురైనా వెనుకడుగు వేయడం లేదు. రాజకీయ విమర్శలకు, వ్యక్తిగత ఆరోపణలకు ప్రతిస్పందిస్తూ సమయం వృథా చేసుకోవడం కంటే గ్రామానికి ఉపయోగపడే పనులు చేయడానికే ప్రాధాన్యతనిస్తున్నారు. మాటలతో హామీలు ఇవ్వడం సులభమే అయినా, వాటిని ఆచరణలో చూపించడమే అసలైన నాయకత్వమని తన పనుల ద్వారా చాటుతున్నారు. గ్రామ పంచాయతీకి సొంత భవనం లేకపోవడం, మహిళా సంఘాలకు ప్రత్యేక సమావేశ వేదిక అవసరం వంటి అంశాలను గుర్తించి వాటి పరిష్కారానికి అడుగులు వేయడం విశేషం. ఈ భవనాలు అందుబాటులోకి వస్తే గ్రామ పాలనకు, మహిళా సంఘాల కార్యకలాపాలకు మరింత సౌలభ్యం కలగనుంది. ఇవి కేవలం నిర్మాణాలు మాత్రమే కాదు.. గ్రామ భవిష్యత్తుకు ఉపయోగపడే అభివృద్ధి పునాదులుగా నిలవనున్నాయి. గ్రామ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే లక్ష్యంగా సర్పంచ్ కమ్లి పూల్య నాయక్ నిరంతరం శ్రమిస్తున్నారు. ప్రచార ఆర్భాటాలకు దూరంగా ఉంటూ అభివృద్ధి పనులనే తనకు అసలైన గుర్తింపుగా భావిస్తున్నారు. గ్రామంలోని ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా ప్రజాప్రతినిధులు, గ్రామస్తుల సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. 11 నెలల ప్రస్థానంలో అభివృద్ధి పనులకు బాటలు వేస్తూ.. గ్రామానికి అవసరమైన శాశ్వత నిర్మాణాలపై దృష్టి సారిస్తూ.. విమర్శలకు చేతలతో సమాధానం చెబుతున్న సర్పంచ్ బాధావత్ కమ్లి పూల్య నాయక్ నాయకత్వం బాంచరాయితండలో ప్రత్యేక చర్చకు దారితీస్తోంది. గ్రామాభివృద్ధి కోసం ఆమె చేస్తున్న ప్రయత్నాలకు ప్రజల సహకారం తోడైతే మరిన్ని ప్రగతి కార్యక్రమాలకు మార్గం సుగమం కానుంది. ఈ కార్యక్రమంలో భూక్య కల్పన, భరత్, ఉపసర్పంచ్, వార్డు సభ్యుడు విజయ్ తదితరులు పాల్గొన్నారు.



భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ ప్రత్యేక పూజలు

డోర్నకల్ విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్: డోర్నకల్ నియోజకవర్గంలోని మరిపెడ పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారి ఆలయాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ సత్యవతి రాథోడ్ శనివారం సందర్శించారు. ఆలయానికి చేరుకున్న ఆమెకు ఆలయ వాతావరణంలో భక్తిశ్రద్ధలతో స్వాగతం పలికారు. అనంతరం భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి మొక్కులు చెల్లించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన మరిపెడ మల్లికార్జున స్వామి ఆలయాన్ని సందర్శించిన సందర్భంగా ఆలయ విశేషాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్‌పర్సన్ బిందు ఆంగోత్, బోడ శ్రీను నాయక్, కొంపల్లి వేణుగోపాల్ రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

యస్.లింగోటం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా చేవెళ్లి శివకృష్ణ

- 30 మందితో మూడు బూత్ కమిటీల ఏర్పాటు



చౌటుప్పల్,విశాల భారతి: మండలోని స్వాములవారి లింగోటం గ్రామ కాంగ్రెస్ పార్టీ శాఖ నూతన అధ్యక్షుడిగా చేవెళ్లి శివకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల సమక్షంలో నిర్వహించిన సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తల ఏకాభిప్రాయంతో చేవెళ్లి శివకృష్ణను గ్రామశాఖ నూతన అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అదేవిధంగా గ్రామంలోని మూడు పోలింగ్ బూత్‌లకు సంబంధించి మొత్తం 30 మందితో బూత్ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ, గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి, పార్టీ కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి నూతన కమిటీలు కృషి చేయాలని ఆకాంక్షించారు. నూతన అధ్యక్షుడు చేవెళ్లి శివకృష్ణ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన మండల నాయకులకు, గ్రామ నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. అందరినీ కలుపుకొని పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, పార్టీ సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు బోయ దేవేందర్, పీఏసీఎస్ చైర్మన్ మస్తాన్ బాబు, ఇంద్రసేనారెడ్డి, అంజయ్య, ఉప్పు భద్రయ్య, సర్పంచ్ ప్రదీప్, బొడిగె ఆనంద్ గౌడ్, అర్థ వెంకట రెడ్డి, జాల మల్లేష్, శేఖర్ గౌడ్, గుండు మల్లయ్య తదితర మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఈ నెల 23న మండల స్థాయి సమీక్ష సమావేశం

- గ్రామాల అభివృద్ధి, ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష
- సర్పంచులు, అధికారుల హాజరు తప్పనిసరి



విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ : అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 23వ తేదీ సోమవారం ఉదయం 10:30 గంటలకు మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీవాణి తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు, వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె ఆదేశించారు. ఈ సమావేశంలో గ్రామ పంచాయతీల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రభుత్వ పథకాలపై సర్పంచులకు అవగాహన, వివిధ శాఖల సమన్వయంతో ప్రభుత్వ పథకాల సమర్థవంతమైన అమలు వంటి అంశాలపై సమీక్షించనున్నారు. అలాగే ఇతర ముఖ్యమైన ప్రభుత్వ కార్యక్రమాల పురోగతి, గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలు, శాఖల వారీగా ఉన్న సమస్యలపై చర్చించనున్నారు. ఇప్పటివరకు తమ శాఖలకు సంబంధించిన ఎజెండా అంశాలను సమర్పించని మండల స్థాయి అధికారులు, సంబంధిత అంశాలకు సంబంధించిన 50 ప్రశ్నలు, పురోగతి నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని ఎంపీడీఓ శ్రీవాణి సూచించారు. ప్రభుత్వ ఆదేశాలు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే సూచనలు, మండల ప్రత్యేక అధికారి ఆమోదంతో ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. సమావేశానికి సంబంధిత అధికారులు, సర్పంచులు సమయానికి హాజరై విజయవంతం చేయాలని ఎంపీడీఓ శ్రీవాణి కోరారు.

ఘనంగా డిస్కవరీ ఓక్స్ స్పోర్ట్స్ ఫెస్టివల్ 3.0

- క్రీడోత్సవాలను ప్రారంభించిన క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ కే. శివసేన రెడ్డి
- చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి : శివసేన రెడ్డి



విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ : పెద్ద అంబర్‌పేట్ పరిధిలోని లక్ష్మారెడ్డిపాలెంలో ఉన్న డిస్కవరీ ఓక్స్ పాఠశాలలో నవంబర్ 21న స్పోర్ట్స్ ఫెస్టివల్ 3.0 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ కే. శివసేన రెడ్డి హాజరై క్రీడోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితాల్లో క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. క్రీడల ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లోనూ ఆసక్తి కనబరుస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. పాఠశాల డైరెక్టర్ నిర్మల తిగుల మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడంతో పాటు వారి సమగ్ర అభివృద్ధికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహించేందుకు పాఠశాల యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వివిధ క్రీడా పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడంతో స్పోర్ట్స్ ఫెస్టివల్ 3.0 వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిశాయి.

ప్రతి గ్రామంలో అంగన్వాడి సెంటర్లో పల్స్ పోలియో కేంద్రాలు

- 0 నుండి5 సం.రాల పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయాలి
- యాచారం ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి రాజ్యలక్ష్మి

విశాల భారతి ఇబ్రహీంపట్నం : ప్రతి గ్రామంలో అంగన్వాడి సెంటర్లలో పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశామని యాచారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజ్యలక్ష్మి శనివారం తెలిపారు. 22 తేదీ నుండి 24 తేదీ వరకు మూడు రోజులు ప్రతి గ్రామంలో అంగన్వాడి సెంటర్ల లో పల్స్ పోలియో చుక్కలు 0 నుండి 5 సంవత్సరాల లోపు వయస్సుగల పిల్లలందరికి పోలియో [2] చుక్కలు వేయాలని సిబ్బందికి సూచించారు.యాచారం మండలం లో గల 0 to 5 వయస్సుగల పిల్లల సంఖ్య 5886,మొత్తం పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటుచేసిన సంఖ్య 44,యాచారం Bus Stand లో Transit పాయింట్, Mobile టీం, ద్వార మండలం లో గల పౌల్ట్రి ఫాం లలో గల పిల్లలందరికి 3 రోజుల పాటు అన్ని ప్రాంతాలలో గల పిల్లలందరికి పోలియో చుక్కలు వేయించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం యాచారం వైద్యాధికారి డాక్టర్ జె . రాజ్యలక్ష్మి, ఆరోగ్య కార్యకర్తలు ఆరోగ్య పర్యవేక్షకులు అంగన్వాడి సిబ్బంది ఆశాకార్యకర్తలు పాల్గొంటున్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి

- సైన్స్ ప్రదర్శనలు భవిష్యత్ ఆవిష్కరణలకు పునాదులు.
- జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, కలెక్టర్ స్నేహ శబరిష్.

మహబూబాబాద్ జిల్లా

విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్.

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు వారిలో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించేందుకు సైన్స్ ఫెయిర్లు ఎంతగానో దోహదపడతాయని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అన్నారు. పుస్తకాల్లో నేర్చుకున్న విజ్ఞానాన్ని ఆచరణలో పెట్టినప్పుడే నూతన ఆవిష్కరణలకు మార్గం సుగమమవుతుందని పేర్కొన్నారు. శనివారం మహబూబాబాద్ జిల్లాలోని అనంతారం మోడల్ స్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌కు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన విద్యార్థులు రూపొందించిన సైన్స్ నమూనాలు, ప్రయోగాత్మక ప్రాజెక్టులను పరిశీలించి వాటి పనితీరు, ఉపయోగాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.



అపజయమే విజయానికి తొలిమెట్టు.

ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ప్రతి అంశాన్ని ప్రశ్నించే తత్వంతో పరిశీలిస్తూ కొత్త విషయాలను నేర్చుకోవాలని, కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణల దిశగా ఆలోచనలు సాగించాలని అన్నారు. అపజయమే విజయానికి తొలిమెట్టని, ఎదురయ్యే సవాళ్లకు భయపడకుండా దృఢ సంకల్పంతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల బాధ్యత అని పేర్కొన్నారు.

సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాలు చూపాలి.

ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ నేటి ప్రపంచంలో విజ్ఞానశాస్త్రం, సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లోనూ అపారమైన ప్రతిభ దాగి ఉందని, వారికి సరైన అవకాశాలు, ప్రోత్సాహం కల్పిస్తే అద్భుతమైన ఆవిష్కరణలు చేయగలరని పేర్కొన్నారు. విద్యార్థులు నూతన సాంకేతికతను అందిపుచ్చుకొని భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా, పరిశోధకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. సైన్స్ ఫెయిర్లలో పాల్గొనడం ద్వారా ఆత్మవిశ్వాసం, పరిశోధనా ఆసక్తి, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం పెరుగుతాయని తెలిపారు. సమాజంలోని సమస్యలకు పరిష్కారం చూపే ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

84 ప్రదర్శనలు.. రాష్ట్రస్థాయికి ఎంపిక.

జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో జిల్లాలోని అన్ని మండలాల నుంచి విద్యార్థులు మొత్తం 384 ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. వీటిలో ఆర్ఎస్‌బీవీ విభాగంలో 270, పీఎంఎస్‌ఆర్ఐ విభాగంలో 42, ఇన్స్పైర్ విభాగంలో 72 ప్రదర్శనలు ఉన్నాయి. విద్యార్థులు రూపొందించిన వినూత్న నమూనాలు, ప్రయోగాత్మక ప్రాజెక్టులు సందర్శకులను ఆకట్టుకున్నాయి. విద్య, పర్యావరణ పరిరక్షణ, సాంకేతిక పరిజ్ఞానం, సామాజిక అవసరాలకు సంబంధించిన అంశాలపై విద్యార్థులు తమ ఆలోచనలను నమూనాల రూపంలో ప్రదర్శించారు. ప్రతి ప్రాజెక్టు వెనుక ఉన్న ఆలోచన, దాని పనితీరు, ఉపయోగాలను విద్యార్థులు వివరించగా అతిథులు అభినందించారు. ఈ ప్రదర్శనల్లో ప్రథమ స్థానంలో నిలిచిన ప్రాజెక్టులు రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపిక కానున్నాయి. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్, జిల్లా సైన్స్ ఫెయిర్ నోడల్ అధికారి అప్పారావు, జిల్లా విద్యాశాఖ అధికారి మందుల శ్రీరాములు, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

కోర్టు నూతన జడ్జికి శుభాకాంక్షలు తెలిపిన న్యాయవాది నర్సింహా రెడ్డి



చౌటుప్పల్,విశాల భారతి: చౌటుప్పల్ జూనియర్ సివిల్ కోర్టుకు నూతనంగా నియమితులైన జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎం.డి.గౌస్ పాషా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం న్యాయవాది వాకిటి నర్సింహా రెడ్డి జడ్జి ని మర్యాదపూర్వకంగా కలిసి ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. అనంతరం నూతన జడ్జి ఎండి గౌస్ బాషా చౌటుప్పల్ కోర్టులో ప్రభుత్వ కేసుల నిర్వహణ, పురోగతి ఎలా ఉందని ప్రత్యేకంగా ఆరా తీశారు. ప్రభుత్వ కేసుల విచారణ, వాటి పురోగతి తదితర అంశాలపై ఆసక్తిగా అడిగి తెలుసుకోవడం సంతోషకరమైన విషయం అని ఈ సందర్భంగా అయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీ పాల పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొన్న సోదా రామకృష్ణ



విశాల భారతి /పరకాల: జోగంపల్లి గ్రామానికి చెందిన బుస్స కొమురయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన దశదినకర్మ కార్యక్రమంలో పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు, మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పరకాల మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఏకు రాజు, తేప్ప కన్నయ్య, బొచ్చు జెమిని తదితరులు పాల్గొన్నారు.

యాసంగిలో 'వరి వద్దు'.. ప్రత్యామ్నాయ పంటలే ముద్దు

- ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరత ముప్పు
- రైతులు ఆరుతడి పంటల సాగుకు సిద్ధం కావాలి
- చెరువుల నీరు తాగునీటి అవసరాలకే పరిమితం.. సాగుకు నీటి విడుదల వద్దు
- పీఏసీఎస్‌లు వారం రోజుల్లో కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలి
- మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్.

మహబూబాబాద్ జిల్లా

విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్.



యాసంగి 202627 సీజన్‌లో వరి సాగుకు స్వస్తి పలికి ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ రైతులకు పిలుపునిచ్చారు. ఎల్‌నినో ప్రభావంతో రానున్న యాసంగిలో వర్షపాతం తగ్గి నీటి లభ్యతపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని, ఈ పరిస్థితులను ముందుగానే అంచనా వేసి రైతులు పంటల ప్రణాళికను మార్చుకోవాలని సూచించారు. అధిక నీటి వినియోగంతో కూడిన వరి సాగుకు బదులుగా తక్కువ నీరు, తక్కువ పెట్టుబడితో పండించే ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ అధికారి స్వర్ణ విజయ్ చంద్ర నిర్వహణలో ఎఫ్‌పీఓలు, పీఏసీఎస్‌లు, ఆత్మ చైర్మన్లు, వివిధ శాఖల అధికారులతో యాసంగి పంటల ప్రణాళికపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం, భవిష్యత్తులో ఎదురయ్యే నీటి కొరత, అందుబాటులో ఉన్న నీటి వనరుల వినియోగంపై రైతులకు ముందస్తు అవగాహన కల్పించాల్సిన బాధ్యత వ్యవసాయ శాఖతో పాటు సంబంధిత సంస్థలపై ఉందన్నారు. వరి సాగు విస్తీర్ణాన్ని గణనీయంగా తగ్గించి పెసర, మినుము, శనగ, కంది, జొన్న, మొక్కజొన్న వంటి ప్రత్యామ్నాయ పంటలను విస్తృతంగా సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని ఆదేశించారు.

చెరువుల నీరు తాగునీటికే..

రానున్న వేసవిలో తాగునీటి అవసరాలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. చెరువుల్లో అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాల కోసం కేటాయించాలని, వ్యవసాయ అవసరాలకు నీటిని విడుదల చేయకుండా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ ఎస్ఈని ఆదేశించారు. నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవడం ద్వారా భవిష్యత్తులో ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించవచ్చన్నారు.

మోటార్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలి.

విద్యుత్ వినియోగం, మోటార్ల సామర్థ్యంపై విద్యుత్ శాఖ ఎస్ఈ రైతులకు పలు సూచనలు చేశారు. వ్యవసాయ విద్యుత్ మోటార్లకు రైతులంతా కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఉద్యాన శాఖ ద్వారా కూరగాయల పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచేలా రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

రైతుల సంక్షేమానికి పీఏసీఎస్‌ల ఆదాయం ఖర్చు చేయాలి.

అనంతరం ఎఫ్‌పీఓల ప్రతినిధులతో కలెక్టర్ ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ప్రతి సంస్థ రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలని, యాసంగిలో వరి సాగు చేపట్టకుండా రైతులను చైతన్యపరచాలని కోరారు. పీఏసీఎస్‌లు తమకు సమకూరుతున్న ఆదాయంలో రైతుల సంక్షేమం కోసం ఖర్చు చేయాలని, ఇందుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికలను వారం రోజుల్లో సిద్ధం చేయాలని ఆదేశించారు. కస్టమ్ హైరింగ్ సెంటర్ల ఏర్పాటుకు సంబంధించిన దరఖాస్తులను కూడా వెంటనే సమర్పించాలని సూచించారు. నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని రైతులు పంటల ఎంపికలో మార్పులు చేసుకోవాలని, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ), అదనపు డీఆర్‌డీఓ, ఇరిగేషన్ ఎస్ఈ, ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ, ఇతర జిల్లా స్థాయి అధికారులు, ఎఫ్‌పీఓలు, పీఏసీఎస్‌ల ప్రతినిధులు, మహబూబాబాద్, మరిపెడ అదనపు వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు, ఆత్మ చైర్మన్, రైతు ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



ఘనంగా రుద్ర టిఫిన్స్ ప్రారంభోత్సవం

- మల్‌రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా ప్రారంభం
- యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ : పెద్ద అంబర్‌పేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన రుద్ర టిఫిన్స్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తన చేతుల మీదుగా రుద్ర టిఫిన్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి రుద్ర టిఫిన్స్ యాజమాన్యానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. నూతనంగా ప్రారంభించిన వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని, ప్రజలకు నాణ్యమైన ఆహార సేవలు అందిస్తూ మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పెద్ద అంబర్‌పేట్ 52వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పండుగుల రాజు, వైస్ చైర్మన్ సిద్ధంకి కృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకులు దండెం రాజశేఖర్ రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున, స్థానిక మాజీ కౌన్సిలర్లు,నాయకులు, కార్యాకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయాలి

- క్రీడల ద్వారా ఆత్మవిశ్వాసం పట్టుదల క్రమశిక్షణ పెంపొందుతాయి
- జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్: (సీఎంఓ)బత్తిని వెంకటేష్



విశాల భారతి ఇబ్రహీంపట్నం : రంగారెడ్డి జిల్లా స్థాయి దివ్యాంగ ప్రత్యేక అవసరాలు కలిగిన సీడ బ్లూఎస్ఎన్విద్యార్థుల క్రీడా పోటీలను శనివారం ఇబ్రహీంపట్నంలోని గురుకుల విద్యాపీఠ్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రంగారెడ్డి జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి (సీఎమ్ఓ) బత్తిని వెంకటేష్, ఇబ్రహీంపట్నం మండల విద్యాధికారి హీర్యా నాయక్, గురుకుల విద్యాపీఠ్ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు హాజరయ్యారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థుల్లో దాగి ఉన్న అంతర్గత ప్రతిభను వెలికితీయడానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు.క్రీడల ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, పట్టుదల, క్రమశిక్షణతో పాటు ఐకమత్య భావన పెంపొందుతాయని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థికి సమాన అవకాశాలు కల్పిస్తూ, వారిని చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.క్రీడల్లో గెలుపోటముల కంటే ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొనడమే ముఖ్యమని స్పష్టం చేశారు.ఈ క్రీడా పోటీల్లో జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. అనంతరం పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అతిథులు బహుమతులు అందజేసి అభినందించారు. సమ్మిళిత విద్య లక్ష్య సాధనలో భాగంగా ఇలాంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమని పలువురు కొనియాడారు.ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన ఐఈఆర్పీ లు, ప్రత్యేక ఉపాధ్యాయులు రవి, రమేష్, వెంకటేష్, సత్యనారాయణ, సత్తయ్య, బాలాజీ, యాదయ్య, లక్ష్మి, అనిత, సువర్ణమాల, శిరీష, సుజాత, అబేదా తదితరులు పాల్గొని క్రీడా పోటీలు విజయవంతం కావడానికి సహకరించారు.

గొప్ప కాలజ్ఞాని వీరబ్రహ్మేంద్రస్వామి

- బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి
- ట్యాంక్ బండ్ పై పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 418 వ జయంతి ఉత్సవాలు

ముషీరాబాద్,విశాల భారతి: భవిష్యత్తులో జరిగేది జరగబోయే దాని గురించి 400 సంవత్సరాల క్రితమే సమాజానికి తెలియజేసిన గొప్ప కాలజ్ఞాని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి అని బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి అన్నారు. విశ్వబ్రాహ్మణ జాతిలో స్వామి పుట్టడం జాతికే గర్వకారణమని పేర్కొన్నారు. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 418 వ జయంతి సందర్భంగా హైదరాబాద్ ట్యాంక్ బండ్ పై ఉన్న స్వామి విగ్రహం వద్ద ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ చారి మాట్లాడుతూ విరాట్ విశ్వకర్మ ఆదిశంకరాచార్యులు, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విశ్వబ్రాహ్మణ జాతిలో పుట్టిన రత్నాలు అని వారి అడుగుజాడల్లో యావత్ భారత దేశం నడుస్తుందని తెలిపారు. వీరి బోధనలను కాలజ్ఞానాన్ని అన్ని భాషల్లో దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ప్రచారం చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి విజ్ఞప్తి చేశారు. అలానే ఢిల్లీలోని పార్లమెంట్ భవనం ఆవరణలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. దేశంలో దాదాపు 11 కోట్ల మంది విశ్వబ్రాహ్మణులు అనేక సమస్యలు ఇబ్బందులతో గురవుతున్నారని వారిని అన్ని విధాలుగా ఆదుకోవాల్సిన అవసరం కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు.

గుడుంబా గుట్టుపై పోలీసుల మెరుపుదాడులు





- రెండు తండాలను జల్లెడ పట్టిన ఖాకీలు
- 4 వేల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం
- 50 లీటర్ల నాటుసారా స్వాధీనం
- 50 ద్విచక్ర వాహనాల తనిఖీ
- తెల్లవారుజామునే రంగంలోకి బిగిన పోలీసు బలగాలు
- అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్

జిల్లాలో నాటుసారా తయారీ, విక్రయాలపై పోలీసుల దాడులు ముమ్మరమయ్యాయి. గుడుంబా తయారీ కేంద్రాలపై ఉక్కుపాదం మోపుతూ శనివారం తెల్లవారుజామున పోలీసులు భారీ స్థాయిలో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. కేసముద్రం మండల పరిధిలోని చెరువుముంతు తండా, బోడమాచ తండాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టి అక్రమ నాటుసారా తయారీదారులకు గట్టి హెచ్చరికలు పంపించారు. ఉదయం 5:30 గంటలకే పోలీసు బలగాలు రంగంలోకి దిగి రెండు గంటలపాటు విస్తృతంగా తనిఖీలు నిర్వహించాయి.

4 వేల లీటర్ల పానకం ధ్వంసం..

తనిఖీల్లో అక్రమ నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన సుమారు 4,000 లీటర్ల బెల్లం పానకాన్ని పోలీసులు గుర్తించి అక్కడికక్కడే ధ్వంసం చేశారు. అదేవిధంగా 50 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. తండాల్లో అనుమానాస్పద ప్రాంతాలు, నాటుసారా తయారీ,నిల్వ,రవాణాకు సంబంధించిన ప్రదేశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. గుడుంబా తయారీకి ఉపయోగించే ముడిసరుకును గుర్తించి నిర్మూలించే దిశగా తనిఖీలు చేపట్టారు. భారీ మొత్తంలో బెల్లం పానకం ధ్వంసం చేయడం అక్రమ తయారీపై పోలీసులు ఎంతటి నిఘా పెట్టారో స్పష్టం చేస్తోంది.

50 వాహనాల తనిఖీ.. పత్రాల పరిశీలన.

కేవలం నాటుసారా తయారీ ప్రాంతాలకే పరిమితం కాకుండా తండాల్లో రాకపోకలు సాగిస్తున్న వాహనాలపైనా పోలీసులు దృష్టిసారించారు. మొత్తం 50 ద్విచక్ర వాహనాలను ఆపి వాటి రికార్డులు, ధ్రువ పత్రాలను పరిశీలించారు. అనుమానాస్పద కదలికలపై నిఘా ఉంచుతూ అక్రమ రవాణాకు అవకాశం లేకుండా తనిఖీలు నిర్వహించారు.

చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కఠిన చర్యలు.

కార్డన్ అండ్ సెర్చ్ అనంతరం తండావాసులతో పోలీసులు సమావేశమై పలు అంశాలపై అవగాహన కల్పించారు. గంజాయి వినియోగం వల్ల కలిగే అనర్థాలు, సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోక్సో చట్టం, బాల్యవివాహాల నిరోధంపై వివరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు ఎవరూ సహకరించవద్దని సూచించారు. కేసముద్రం,నెల్లికుదురు,ఇనుగుర్తి పోలీస్ స్టేషన్ల ఎస్సైలు,సర్కిల్ పోలీసు సిబ్బంది సమన్వయంతో ఈ ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.అక్రమ నాటుసారా తయారీ, విక్రయాలు, రవాణాకు పాల్పడే వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని కేసముద్రం సీఐ సత్యనారాయణ స్పష్టం చేశారు. గుడుంబా తయారీని ప్రోత్సహించినా, అందులో భాగస్వాములైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.జిల్లాలో అక్రమ మద్యం తయారీకి అడ్డుకట్ట వేసేందుకు పోలీసుల నిఘా, తనిఖీలు నిరంతరం కొనసాగనున్నాయి.

సవాలును స్వీకరించారు.. సురక్షిత ప్రసవం చేశారు

పాల్వంచ విశాలభారతి:

పాల్వంచ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యులు సమయస్ఫూర్తి, వైద్య నైపుణ్యంతో అరుదైన వైద్య విజయాన్ని సాధించారు. పలు ఆరోగ్య సమస్యలతో కూడిన హైరిస్క్ గర్భిణికి అత్యవసర సిజేరియన్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి తల్లీబిడ్డ ఇద్దరినీ క్షేమంగా కాపాడారు. వివరాల్లోకి వెళ్తే.. పాల్వంచ మండలానికి చెందిన 25 ఏళ్ల శిరీష మొదటి కాన్పు కోసం , పాల్వంచ హాస్పిటల్ కి వచ్చింది.ఆమెకు థైరాయిడ్ సమస్య, గర్భధారణ సమయంలో రక్తపోటు పెరగడం, రక్తంలో చక్కెర స్థాయిలు అధికంగా ఉండటం వంటి సమస్యలతో పాటు 115 కిలోల అధిక శరీర బరువు కూడా ఉంది. అంతేకాకుండా కడుపులోని శిశువు కూడా అధిక బరువుతో ఉండటంతో వైద్యులు ఈ కేసును హైరిస్క్‌గా గుర్తించారు. సాధారణంగా ఇలాంటి క్లిష్టమైన కేసులను మెరుగైన వైద్య సదుపాయాలున్న పెద్ద ఆసుపత్రులకు తరలిస్తుంటారు. అయితే ఈ కేసును పాల్వంచ హాస్పిటల్ లోనే నిర్వహించేందుకు ప్రసూతి వైద్యురాలు డాక్టర్ ఎస్. లీనా, మత్తు వైద్యుడు డాక్టర్ పి. రాంప్రసాద్ ప్రత్యేక చొరవ చూపారు. కేసులోని ప్రమాదాలను అంచనా వేసి, పరస్పర సమన్వయంతో బాధ్యతగా ముందడుగు వేసి ఈ సవాలును స్వీకరించారు. అవసరమైన వైద్య ఏర్పాట్లతో తమ వైద్య బృందంతో కలిసి విజయవంతంగా అత్యవసర సిజేరియన్ శస్త్రచికిత్స నిర్వహించారు.వారి సమయస్ఫూర్తి, వైద్య నైపుణ్యం, సమన్వయంతో 3.25 కిలోల బరువున్న ఆడ శిశువు సురక్షితంగా జన్మించింది.ప్రస్తుతం తల్లీబిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారు. సాధారణంగా ఉన్నతస్థాయి ఆసుపత్రులకు పంపించే ఇలాంటి క్లిష్టమైన కేసును స్థానిక హాస్పిటల్ లోనే స్వీకరించి, విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించిన ప్రసూతి వైద్యురాలు డాక్టర్ ఎస్. లీనా, మత్తు వైద్యుడు డాక్టర్ పి. రాంప్రసాద్‌తో పాటు మొత్తం వైద్య బృందాన్ని జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయ అధికారి డాక్టర్ రవి బాబు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ముక్కంటేశ్వరావు



ప్రత్యేకంగా అభినందించారు. పెద్దాసుపత్రులకు దీటుగా ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం వంటి చిన్న ఆసుపత్రులలో సైతం నాణ్యమైన ప్రసూతి వైద్యం, అత్యవసర శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

మాకు పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రి అంటే నమ్మకం .. అందుకే ఇక్కడ ప్రసవం- కుటుంబ సభ్యులు

మా కుటుంబం లో చాలా మంది పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవం జరిగిందనీ, కోవిడ్ సమయంలో సైతం ఇక్కడే మా కుటుంబ సభ్యులకు కాన్పు సురక్షితంగా చేశారని. అందుకే రక్తపోటు ,మధుమేహం , అధిక బరువు, మొదలగు సమస్యలు ఉన్న కూడా నమ్మకం తో వచ్చామని, మా నమ్మకాన్ని వమ్ము కాకుండా వైద్యులు సురక్షిత ప్రసవం చేశారని భర్త శశికాంత్ తెలిపారు. 20 ఏళ్ల క్రితం తను కూడా ఇక్కడే ప్రసవం చేపించుకున్నానని, ఇప్పుడు తన కూతురు సైతం పాల్వంచ ఆసుపత్రిలో ప్రసవం జరగడం ఆనందంగా ఉందని,ఆసుపత్రి వైద్యులకి, సిబ్బందికి మా కుటుంబం రుణపడి ఉంటామని శిరీష తల్లి భాగ్యమ్మ తెలిపారు.

మైనార్టీ స్కూల్లో దుప్పట్లు, మెడికల్ కిట్స్ పంపిణీ

- లయన్స్ క్లబ్ సమితి చేస్తున్న సేవలు అభినందనీయం
- సుర్వి మల్లేష్ గౌడ్ సర్పంచ్.ఫోరమ్ అధ్యక్షులు

చౌటుప్పల్,విశాల భారతి: చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్లో శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ హాజరయ్యారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎండి అతహర్ పాషా అధ్యక్షతన,



సెక్రటరీ దాచేపల్లి రాజు, ఉపాధ్యక్షులు కామిశెట్టి చంద్రశేఖర్ గుప్తా, దాచేపల్లి శ్రీనివాస్ గార్ల సహకారంతో విద్యార్థులకు దుప్పట్లు, మెడికల్ కిట్స్ అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ... లయన్స్ క్లబ్ సేవ సమితి వారు మండల పరిధిలో చేస్తున్న కార్యక్రమాలు చాలా బాగున్నాయని అన్నారు. ఇందులో భాగంగా తమ గ్రామంలోని మైనార్టీ స్కూలు పేద విద్యార్థులకు గత కొన్ని పర్యాయాలుగా చేస్తున్న సేవలు, అలాగే మండలంలోని పలు గ్రామాల ప్రజల అవసరాలను గుర్తించి చేస్తున్న సేవలు, ప్రతి సోమవారం కంటి పరీక్షలకు ప్రత్యేక దృష్టితో చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవ కమిటీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ దాచేపల్లి రాజు, ట్రెజరర్ బత్తిని రఘు, కాసుల వెంకటేశం గౌడ్, కొసనం రామ్ రెడ్డి, దాచేపల్లి శ్రీనివాస్, సిలువేరు మంగయ్య, గోపగోని లక్ష్మణ్ గౌడ్, పోలోజు శ్రీనివాస్ చారి, మైనార్టీ స్కూల్ ప్రిన్సిపాల్ బాలకృష్ణ గారు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐబీఎస్ హైదరాబాద్‌లో ఘనంగా 'ఆవేగ్ XVIII' క్రీడా సంబరం

- 14 విభాగాల్లో క్రీడా పోటీలు.. విద్యార్థుల్లో ప్రతిభ, జట్టుస్ఫూర్తికి ప్రోత్సాహం




చేవెళ్ల, విశాల భారతి : ఐసీఎఫ్ఏఐ బిజినెస్ స్కూల్ (ఐబీఎస్) హైదరాబాద్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మక వార్షిక క్రీడా వేడుక 'ఆవేగ్ XVIII' నిర్వహణకు ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. ఐబీఎస్ హైదరాబాద్ అధికారిక క్రీడలు, ఫిట్‌నెస్ క్లబ్ టీమ్ వాప్స్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఈ క్రీడా ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడంతో పాటు క్రమశిక్షణ, జట్టుస్ఫూర్తి, పరస్పర సహకారం, ఆరోగ్యకరమైన పోటీతత్వాన్ని పెంపొందించడమే ఈ వేడుక ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ క్రీడా ఉత్సవంలో మొత్తం 14 విభాగాల్లో ఇండోర్, అవుట్‌డోర్ పోటీలు నిర్వహించనున్నారు. క్రికెట్, మహిళల క్రికెట్, ఫుట్‌బాల్, పురుషులు, మహిళల బాస్కెట్‌బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్ సింగిల్స్, డబుల్స్, క్యారమ్స్, టేబుల్ క్రికెట్, స్క్వాష్, టేబుల్ టెన్నిస్, లాన్ టెన్నిస్ తదితర పోటీలు జరగనున్నాయి. వివిధ క్రీడల్లో విద్యార్థులు తమ ప్రతిభ, శారీరక సామర్థ్యం, చురుకుదనం, వ్యూహాత్మక ఆలోచనా నైపుణ్యాలను ప్రదర్శించేందుకు ఈ వేడుక చక్కటి వేదికగా నిలవనుంది. ఈ కార్యక్రమానికి ఐబీఎస్ హైదరాబాద్ విద్యార్థుల కార్యక్రమాల సమన్వయకర్త ప్రొఫెసర్ మాధవి గరికపర్తి సంస్థాగత మార్గదర్శకత్వం, పరిపాలనా సహకారం అందిస్తున్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, ఇతర సహపాఠ్య కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనాలని ఆమె ప్రోత్సహిస్తున్నారు. తద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానం, సమష్టి కృషి వంటి నైపుణ్యాలు పెంపొందుతున్నాయి. అదేవిధంగా టీమ్ వాప్స్ క్లబ్ మార్గదర్శకురాలు ప్రొఫెసర్ శ్వేతా సింగ్ పర్యవేక్షణలో క్రీడా పోటీల ప్రణాళిక, షెడ్యూల్ రూపకల్పన, నిర్వహణ ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. విద్యార్థుల ప్రధాన కమిటీతో సమన్వయం చేసుకుంటూ పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు ఆమె కృషి చేస్తున్నారు. టీమ్ వాప్స్ క్లబ్ క్యాంపస్‌లో క్రీడా సంస్కృతిని బలోపేతం చేయడంతో పాటు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను ప్రోత్సహించేందుకు కృషి చేస్తోంది. కేవలం గెలుపోటములకే పరిమితం కాకుండా స్నేహబంధాలు, పరస్పర గౌరవం, క్రీడాస్ఫూర్తి, ఐక్యత వంటి విలువలను పెంపొందించడమే ఆవేగ్ XVIII ప్రత్యేకతగా నిలవనుంది. విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి ఈ క్రీడా సంబరం దోహదపడుతుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

- కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి
- నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని ఆరు డివిజన్లకు చెందిన 544 మందికి చేయూత పింఛన్ మంజూరు పత్రాల పంపిణీ
- ఇచ్చిన హామీలను అంచెలంచెలుగా అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నాం

నిజామాబాద్ జిల్లా విశాల భారతి:



అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడమే తమ కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి పేర్కొన్నారు. శనివారం నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ పరిధిలోని ఆరు డివిజన్లకు చెందిన నూతన చేయూత పింఛన్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొత్తం 544 మంది లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు. డివిజన్ల వారీగా: కాలూరు-ఖానాపూర్‌లో 145, గూపన్‌పల్లిలో 59, మాధవ్‌నగర్‌లో 61, బోర్గాం (పి)లో 87, సారంగాపూర్‌లో 143, ముబారక్‌నగర్‌లో 49 మందికి పింఛన్లు మంజూరయ్యాయి.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి మాట్లాడుతూ...

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొత్తగా అర్హులకు పింఛన్లు మంజూరు చేసిన దాఖలాలు లేవని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే నూతనంగా పింఛన్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. గత పాలకులు రాష్ట్రంపై మోపిన అప్పుల భారం కారణంగా కొన్ని పథకాల అమలులో ఆలస్యం జరుగుతున్నప్పటికీ, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.అర్హత ఉండి ఇప్పటివరకు పింఛన్లు రానివారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రానున్న రోజుల్లో దశలవారీగా అర్హులందరికీ పింఛన్లు అందిస్తామని భరోసా ఇచ్చారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు ప్రాణత్యాగాలు చేసిన త్యాగాల పునాదులపై ఏర్పడిన పార్టీ కాంగ్రెస్ అని, ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేయడమే కాంగ్రెస్ పార్టీ విధానమని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు, గత ప్రభుత్వ అప్పులు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మంత్రివర్గ సహచరులతో సమన్వయం చేసుకుంటూ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, రేషన్ కార్డుల పంపిణీ, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్ల వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పెద్ద పెద్ద వ్యాపారాల్లో రాణించేలా ప్రోత్సహిస్తున్నామని, ఇందుకోసం సంవత్సరానికి రూ.20 వేల కోట్ల చొప్పున మూడేళ్లలో నిర్దేశిత లక్ష్యాన్ని మించి రూ.79 వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందించామని తెలిపారు. దివ్యాంగులకు నెలకు రూ.4,016, ఇతర అర్హులైన పింఛన్‌దారులకు నెలకు రూ.2,016 చొప్పున చేయూత పింఛన్లు అందిస్తున్నామని వివరించారు. పట్టణ ప్రాంతాల్లోనూ ఇందిరమ్మ టవర్స్ ద్వారా పేదలకు గృహ వసతి కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు వారి కుటుంబాలకు భద్రత కల్పించేందుకు గతంలో రైతులకు మాత్రమే పరిమితమైన బీమా సౌకర్యాన్ని విస్తరించి, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా ప్రతి పేద కుటుంబానికి రూ.5 లక్షల బీమా కల్పించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తూ పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, మెరుగైన వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కూడా లేని అనేక సంక్షేమ పథకాలను తెలంగాణలోని ఇందిరమ్మ రాజ్యంలో అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2047 నాటికి తెలంగాణను అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపే లక్ష్యంతో రైజింగ్ తెలంగాణ-2047 విజన్‌తో ముందుకు సాగుతున్నారని తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుంటే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాత్రం నిధుల కేటాయింపులో తెలంగాణ పట్ల వివక్ష చూపుతోందని విమర్శించారు. రాష్ట్రం నుంచి పన్నుల రూపంలో కేంద్రానికి రూపాయి వెళ్తే తిరిగి కేవలం 42 పైసలే వస్తున్నాయని, బీజేపీ పాలిత రాష్ట్రాలకు అధిక నిధులు కేటాయిస్తూ తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించకుండా వారానికోసారి ప్రెస్‌మీట్లు పెట్టడానికే పరిమితమవుతున్నారని విమర్శించారు. తాను వైద్య వృత్తిని సైతం పక్కనపెట్టి నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని తెలిపారు. నిజామాబాద్ నగరంలో విలీనమైన గ్రామాల్లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ఆయా ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. విలీన గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపించే బాధ్యత తనదేనని, ప్రజలు జరుగుతున్న అభివృద్ధి పనులను గమనించాలని కోరారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని, ఇప్పటికే పింఛన్లు పొందుతున్న వారితో పాటు కొత్తగా అర్హత సాధించిన వారికీ నిబంధనల ప్రకారం పథకాల ప్రయోజనాలు అందిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం, మహిళా సాధికారత, రైతుల అభ్యున్నతి, విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి ప్రాధాన్యత నిస్తూ ప్రజా ప్రభుత్వంగా ముందుకు సాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గీత పారిశ్రామిక సహకార కార్పొరేషన్ చైర్మన్ శేఖర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి, సాయరెడ్డి, బాగా రెడ్డి, డివిజన్ల కార్పొరేటర్లు బోజన్న, హరిచంద్, డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్, రాజలింగం, అశోక్, హన్మాండ్లు. కాంగ్రెస్ నాయకులు దమ్మాయి రమేష్ పరశురాం పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు..

మొండి గౌరెల్లి లో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం

- ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసాగా జీవిత బీమా
- ప్రభుత్వమే జీవిత బీమా సౌకర్యం కల్పిస్తుంది
- మొండి గౌరెల్లి సర్పంచ్ కొలన్ రమాదేవి మల్లారెడ్డి

విశాల భారతి ఇబ్రహీంపట్నం: యాచారం మండల పరిధిలోని మొండి గౌరెల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ కొలన్ రమాదేవి మల్లారెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోలన్ రమాదేవి మల్లారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత,

విద్యార్థి మృతికి బాధ్యులెవరు?

- కార్తీక్ కుటుంబానికి న్యాయం చేయాలని బీసీ సంఘాల డిమాండ్
- కళాశాల యాజమాన్యంపై విచారణ చేపట్టాలని ఆందోళన
- నాగార్జునసాగర్ జాతీయ రహదారిపై 40 నిమిషాల నిరసన

విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :



శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థి షేర్గూడెం కార్తీక్ ఆత్మహత్య ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. బొంగులూరు క్యాంపస్‌లో ఫస్టియర్ బైపీసీ చదువుతున్న కార్తీక్ కళాశాలలోనే ప్రాణాలు కోల్పోవడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని బీసీ పీపుల్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర అధ్యక్షుడు బొంగు వెంకటేష్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి మృతికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి, కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

సెలవు నిరాకరణపై ఆరోపణలు..

సమగ్ర విచారణకు డిమాండ్

కార్తీక్ కుటుంబంలో గృహప్రవేశ కార్యక్రమం ఉన్నందున కళాశాలకు సెలవు ఇవ్వాలని లేదా కార్యక్రమానికి హాజరయ్యేందుకు అనుమతి ఇవ్వాలని యాజమాన్యాన్ని కోరినప్పటికీ అనుమతి నిరాకరించినట్లు కుటుంబ సభ్యులు, విద్యార్థుల ద్వారా తెలుస్తోందని బొంగు వెంకటేష్ గౌడ్ తెలిపారు. ఈ ఆరోపణలతో పాటు విద్యార్థి ఆత్మహత్యకు దారితీసిన ఇతర పరిస్థితులపై కూడా అధికారులు అన్ని కోణాల్లో విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. కార్తీక్ కుటుంబానికి న్యాయం చేయాలని, కళాశాల యాజమాన్యం బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో కలిసి బొంగు వెంకటేష్ గౌడ్ ఆందోళనలో పాల్గొన్నారు. నాగార్జునసాగర్ జాతీయ రహదారిపై సుమారు 40 నిమిషాల పాటు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ ఆందోళనకు పలు బీసీ సంఘాలు, విద్యార్థి సంఘాలు, ఏబీవీపీ, ఏఐఎస్ఎఫ్, గిరిజన సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున మద్దతు ప్రకటించారు.

విద్యార్థుల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలి

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కార్తీక్ కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయాలని, ఘటనపై నిష్పక్షపాత విచారణ చేపట్టి బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై ఒత్తిడి, వేధింపులు లేకుండా విద్యాసంస్థల్లో పటిష్టమైన నిబంధనలు అమలు చేయాలని కోరారు. విద్యార్థుల ప్రాణాల కంటే విద్యాసంస్థల నియమ నిబంధనలు గొప్పవి కావని, ఇలాంటి విషాద ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్తీక్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు బీసీ పీపుల్స్ ఫెడరేషన్ అండగా ఉంటుందని బొంగు వెంకటేష్ గౌడ్ స్పష్టం చేశారు. ఈ నిరసనలో గుమ్మడవెల్లి జ్ఞానేశ్వర్, బంజారా జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు గాంధీ నాయక్, తెలంగాణ ఉద్యమకారుడు కా. రింగుల నరేందర్ గౌడ్, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి నాయకులు శివ, కత్తుల కృష్ణ, ఎంఆర్పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అనంతుల రామ్మూర్తి గౌడ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంద స్వామి, ఎస్సీ ఎస్టీ స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు, చింత పరశురాం, మొండి కత్తి సతీష్, బీఎస్ఎఫ్ నాయకులు, చిన్నోజు శ్రీనివాస్, చందర్ నాయక్, హరీష్ నాయక్, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తాటిపర్తిలో నూతన పింఛన్ ప్రొసీడింగ్స్ పంపిణీ

- గ్రామ సర్పంచ్ నీలం ఝాన్సీ రమేష్



విశాల భారతి ఇబ్రహీంపట్నం: యాచారం మండల పరిధిలోని తాటిపర్తి గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు నూతన పింఛన్ ప్రొసీడింగ్స్ ను శనివారం గ్రామ సర్పంచ్ నీలం ఝాన్సీ రమేష్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం, వితంతువులు, వికలాంగుల సంక్షేమం కోసం అందిస్తున్న పింఛన్లను ప్రతి అర్హుడికి అందేలా చూస్తున్నామని, ఎవరూ మధ్యవర్తులకు డబ్బులు ఇవ్వవద్దని సూచించారు.పింఛన్ అందుకున్న లబ్ధిదారులు సర్పంచ్ కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ముప్పిడి రమేష్ సెక్రటరీ శివకుమార్, వార్డు సభ్యులు అంగన్వాడీ టీచర్స్ మహిళా సంఘాలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నందివనపర్తిలో వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం

- చుట్టుప్రక్కల గ్రామాలు సద్వినియోగం చేసుకోవాలి
- గ్రామ సర్పంచ్ రాయకంటి విజయ్ కుమార్



విశాల భారతి ఇబ్రహీంపట్నం:: యాచారం మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ రాయికంటి విజయ్ కుమార్, సిసి యారా జయలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన పంటను నేరుగా వడ్ల కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని, ప్రభుత్వం ఇచ్చిన రేటు ప్రకారం ఏ గ్రేడు వడ్లకు 2,461 రూపాయలు, కామన్ గ్రేడు దొడ్డు రకం వడ్లకు 2,441 రూపాయలు, సన్నరకం వడ్లకు 500 రూపాయలు బోనస్ గా ఇస్తుందని ఈ అవకాశాన్ని రైతులందరూ చుట్టుప్రక్కల గ్రామాలు, సింగారం చౌదర్పల్లి, మొగుళ్ల పంపు, ఇతర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జెనిగె శ్రీశైలం, గ్రామ సెక్రెటరీ సంపత్ కుమార్, సిసి యారా జయలక్ష్మి, గ్రామ సంఘం ఓబీలు, వివోలు, కమిటీ మెంబర్స్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫోటోజర్నలిస్టుగా శ్రవణ్ కుమార్



కూకట్పల్లి విశాల భారతి: ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ స్టేట్ ఫోటోజర్నలిస్ట్స్ అసోసియేషన్ (TSPJA) నిర్వహించిన ఉత్తమ వార్తా ఛాయాచిత్రాల పోటీ-2026లో సమస్తే తెలంగాణ ఫోటోజర్నలిస్ట్ గడ్డం శ్రవణ్ కుమార్ అవార్డు అందుకున్నారు. బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డును అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఈ అవార్డును ప్రదానం చేశారు.సమాజంలో చోటుచేసుకునే మార్పులు, ప్రజా సమస్యలను ఛాయాచిత్రాల ద్వారా కళ్లకు కట్టినట్లు చూపిస్తూ.. వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేయగల వృత్తిలో ఉండటం అదృష్టంగా భావిస్తున్నట్లు శ్రవణ్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా అవార్డు అందుకున్న శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ తనను ప్రోత్సహించిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, సీనియర్ జర్నలిస్టులు, సీనియర్ ఫోటోజర్నలిస్టులు, మిత్రులు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులోనూ ప్రజా సమస్యలను ప్రతిబింబించే ఉత్తమ ఛాయాచిత్రాలను అందించేందుకు కృషి చేస్తానన్నారు.

బాలల భద్రత మనందరి బాధ్యత

- గుడ్ టచ్ – బ్యాడ్ టచ్, పోక్సో చట్టంపై అవగాహన సదస్సు



పాల్వంచ విశాల భారతి: విద్యార్థిని విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, స్టార్ చిల్డ్రన్ హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యక్తిగత భద్రతా విద్య పై శనివారం అవగాహన సదస్సును నిర్వహించారు.జిల్లా విద్యాశాఖాధికారి అధికారిక అనుమతి మేరకు, 'స్వేచ్ఛ ఫర్ లిటిల్ బర్డ్స్' ప్రాజెక్ట్ కింద ఈ సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ శ్రీమతి ఎండీ.షబానా అహ్మద్ బొమ్మల సహాయంతో విద్యార్థులకు 'గుడ్ టచ్ -బ్యాడ్ టచ్' మరియు వ్యక్తిగత భద్రతా అంశాలను వివరించారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ జి.భాస్కరరావు మాట్లాడుతూ ప్రైవేట్ శరీర భాగాల గురించి మరియు వాటి భద్రత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. 18 సంవత్సరాల లోపు ఆడ, మగ పిల్లల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే పోక్సో చట్టం ప్రకారం తీవ్రమైన నేరమని, ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని లేదా చైల్డ్ హెల్ప్‌లైన్ - 1098 సహాయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

మాతృభాషలోనే డిజిటల్ సేవలు



విశాలభారతి, స్టేట్ బ్యూరో: హైదరాబాద్‌లోని గండిపేట చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ)లో నిర్వహించిన రెండో ప్రాంతీయ ఇంజినీరింగ్‌లో నూతన ధోరణుల సదస్సు (RCETE)లో డిజిటల్ ఇండియా భాషిణి విభాగం బహుభాషా కృత్రిమ మేధస్సు (AI) సాంకేతికతలను ప్రదర్శించింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ పరిధిలోని డిజిటల్ ఇండియా కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేశారు. భారతీయ భాషల మధ్య సమాచార మార్పిడిని సులభతరం చేయడం, ప్రజలకు వారి మాతృభాషల్లో డిజిటల్ సేవలను అందించడం ఈ ప్రదర్శన ప్రధాన ఉద్దేశం. ఇందులో మెషిన్ ట్రాన్స్‌లేషన్, స్పీచ్ రికగ్నిషన్, టెక్స్ట్ టుస్పీచ్, లిప్యంతరీకరణ, సహజ భాషా ప్రక్రియ (NLP) వంటి సాంకేతికతలను ప్రత్యక్షంగా వివరించారు.ప్రభుత్వ పాలన, వ్యవసాయం, వైద్యం, విద్య, ప్రజా సేవల్లో వీటి వినియోగాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా న్యాయ సేవల కోసం న్యాయ సేతు, వ్యవసాయ రంగానికి భారత్ విస్తార్, భాషల మధ్య అనువాదానికి భాషిణి మొబైల్ యాప్, ప్రసంగాలను అక్షరాలుగా మార్చే శ్రుతలేఖ్, ప్రభుత్వ పథకాల సమాచారాన్ని అందించే మేరీ యోజన చాట్‌బాట్ వంటి అప్లికేషన్లను ప్రదర్శించారు. అలాగే ప్రజల భాగస్వామ్యంతో భారతీయ భాషల డేటాను అభివృద్ధి చేసే భాషాదాన్ కార్యక్రమాన్ని పరిచయం చేశారు. పలువురు విద్యావేత్తలు, పరిశోధకులు, సాంకేతిక నిపుణులు ఈ స్టాల్‌ను సందర్శించి సాంకేతికతల పనితీరును పరిశీలించారు. విద్యార్థులు, అధ్యాపకులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని అప్లికేషన్లను స్వయంగా ఉపయోగించి వాటి ప్రత్యేకతలను తెలుసుకున్నారు. భారతదేశ భాషా వైవిధ్యాన్ని ఆధునిక సాంకేతికతతో అనుసంధానిస్తూ, ప్రతి ఒక్కరికీ తమ మాతృభాషలో డిజిటల్ సేవలు అందించడమే భాషిణి లక్ష్యమని ఈ ప్రదర్శన ద్వారా వివరించారు.


ఐసీసీ కమిటీని పునఃపరిశీలించాలి..
టాసా డిమాండ్

రాజేంద్రనగర్, విశాల బారతి :



ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ఐసీసీ) ఏర్పాటు విషయంలో యాజమాన్యం అనుసరించిన విధానంపై తెలంగాణ వ్యవసాయ శాస్త్ర వేత్తల సంఘం (టాసా) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. శనివారం జారీ చేసిన కమిటీ నియామక ఉత్తర్వులపై నిరసన తెలిపిన సంఘం ప్రతినిధులు, కమిటీ కూర్పును పునఃపరిశీలించాలని డిమాండ్ చేశారు.కమిటీ సభ్యుల ఎంపికకు ముందు ఎవరిని సంప్రదించారో యాజమాన్యం స్పష్టం చేయాలని టాసా ప్రతినిధులు ప్రశ్నించారు. ఎన్నికైన బోధన, బోధనేతర ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సంప్రదింపులు జరపకపోవడం, వారికి కమిటీలో ప్రాతినిధ్యం కల్పించకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. కమిటీలో నియమితులైన సభ్యులు వైస్ ఛాన్సలర్‌కు అనుకూలంగా ఉన్నారనే అభ్యంతరాన్ని కూడా లేవనెత్తారు. వైస్ ఛాన్సలర్‌కు మద్దతుగా ఉన్న కొందరు ఉద్యోగులపై విద్యార్థినులు ఫిర్యాదులు చేస్తున్న నేపథ్యంలో, ప్రస్తుత కమిటీ కూర్పు వల్ల బాధితుల ఫిర్యాదులకు సరైన న్యాయం జరగకపోవచ్చని టాసా ఆందోళన వ్యక్తం చేసింది. విద్యార్థినులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమ సమస్యలను స్వేచ్ఛగా తెలియజేసే వాతావరణం కల్పించాలని, ఫిర్యాదులను స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా విచారించేలా కమిటీని ఏర్పాటు చేయాలని కోరింది. ఈ విషయాలపై వివరణ కోరేందుకు రిజిస్ట్రార్‌ను కలిసిన టాసా ప్రతినిధులతో ఆయన చర్చించేందుకు నిరాకరించారని సంఘం ఆరోపించింది. అంతేకాకుండా 'నాన్సెన్స్' అంటూ కించపరిచే విధంగా మాట్లాడటంతో పాటు, 'మీరేం చేసుకుంటారో చేసుకోండి.. మీపై కేసు పెడతాం' అంటూ హెచ్చరించారని పేర్కొంది. ఎన్నికైన ఉద్యోగ సంఘాల ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత కలిగిన అధికారి ఈ విధంగా వ్యవహరించడం సరికాదని టాసా ప్రతినిధులు తీవ్రంగా ఖండించారు. విశ్వవిద్యాలయ యాజమాన్యం కమిటీ సభ్యుల ఎంపికకు అనుసరించిన ప్రమాణాలను బహిర్గతం చేయాలని, ఎన్నికైన బోధన, బోధనేతర సంఘాల ప్రతినిధులతో చర్చలు జరపాలని టాసా డిమాండ్ చేసింది. విద్యార్థినుల ఫిర్యాదులపై ఎలాంటి ఒత్తిళ్లు, పక్షపాతం లేకుండా న్యాయబద్ధమైన విచారణ జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ మేరకు తెలంగాణ వ్యవసాయ శాస్త్రవేత్తల సంఘం (టాసా) తన నిరసనను వ్యక్తం చేసింది.

శ్రీ శ్రీ శ్రీ బుగ్గరామలింగేశ్వర స్వామి
జాతర గోడపత్రిక విడుదల



- దేవాలయ కమిటీ చైర్మన్ అనంగలయాదయ్య
- సహకార సంఘం చైర్మన్ వెదిరె హనుమంత్ రెడ్డి

విశాలభారతి ఇబ్రహీంపట్నం :

ఈనెల నవంబర్ 24న కార్తీక పౌర్ణమి నుండి ప్రారంభం అయ్యే శ్రీ శ్రీ శ్రీ ఆరుట్ల బుగ్గరామలింగేశ్వర స్వామి బుగ్గ జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణంలో దేవాలయ కమిటీ చైర్మన్ అనంగల్ల యాదయ్య ఆధ్వర్యంలో గోడ పత్రిక న శనివారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మంచాల మండల్ సహకార సంఘం చైర్మన్ వెదిరె హనుమంతు రెడ్డి దేవాలయ కమిటీ సభ్యులు వెదిరె జ్యోతి రమణ రెడ్డి దసరమోని రమేష్ మనీపాటి వెంకటేష్ , ఎనిధుల సురేష్ సపవత్ లచ్చిరాం బత్తుల రవీందర్ గ్రామ కార్యదర్శి చిందం శ్రీశైలం ప్రజాగళం దామర భూపాల్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు బుట్టి కృష్ణ యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు వెదిరె సికిందర్ రెడ్డి గ్రామ పెద్దలు గుడ్డి మల్లి చంద్రయ్య మారగోని మాసయ్య గౌడ్ చిందం ఐలయ్య పాండాల శ్రీనివాస్ మడపాకుల యాదయ్య దూసరి రాజు లొంగారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

- ఆచూకీ త్వరగా గుర్తించాలని పోలీసులకు సూచన

విశాల భారతి, ఎల్‌బీనగర్ :



నాగోల్ డివిజన్ పరిధిలోని సాయిరాం నగర్ కాలనీకి చెందిన రవి, శిరీష దంపతుల కుమారులు వరుణ్ తేజ్ (8), మహేష్ (6) గత అక్టోబర్ 31వ తేదీ నుంచి కనిపించకుండా పోవడంతో వారి కుటుంబాన్ని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పరామర్శించారు. చిన్నారులు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు నాగోల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి చిన్నారుల నివాసానికి వెళ్లి తల్లిదండ్రులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం నాగోల్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ మక్బూల్ జానీతో మాట్లాడి తప్పిపోయిన చిన్నారుల ఆచూకీని వీలైనంత త్వరగా గుర్తించాలని కోరారు. చిన్నారులను క్షేమంగా తల్లిదండ్రుల వద్దకు చేర్చేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. పిల్లల కోసం ఎదురుచూస్తూ ఆవేదన చెందుతున్న తల్లిదండ్రులకు త్వరగా ఊరట కలిగించేలా పోలీసులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పి.ఎం.ఆర్.రాజు, సీతారాములు, నాగోల్ ఇన్స్పెక్టర్ మహ్మద్ మక్బూల్ జానీ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ బీమాపై అవగాహన

- చేయూత పింఛన్ల పంపిణీ
- అర్హులందరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి.
- సర్పంచ్ నక్క అలివేలు వెంకటేష్



విశాల భారతి ఇబ్రహీంపట్నం: యాచారం మండల పరిధిలోని అయ్యవారిగూడ గ్రామపంచాయతీలో సర్పంచ్ నక్క అలివేలు వెంకటేష్ అధ్యక్షతన ఇందిరమ్మ కుటుంబ బీమా పథకంపై అవగాహన, నమోదు కార్యక్రమంతో పాటు చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీఓ శ్రీలత, సూపర్డెంట్ వెంకటమహాలక్ష్మి హాజరైనారు. ఈ సందర్భంగా సర్పంచ్ నక్క అలివేలు వెంకటేష్ మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వం అందిస్తున్న చేయూత పింఛన్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కిషన్ నాయక్, వార్డు సభ్యులు మహేష్, గోపాల్, అంజలి, మంజుల, గ్రామ కార్యదర్శి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

చింతపట్లలో 59 పెన్షన్లు పంపిణీ

- వికలాంగులకు వృద్ధులకు పెన్షన్లు ఎంతో బాసట
- సంతోషం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు.
- చింతపట్ల గ్రామ సర్పంచ్ తొట్ట రాజు.



విశాల భారతి ఇబ్రహీంపట్నం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన పెన్షన్ల ను శనివారం యాచారం మండల పరిధిలోని చింతపట్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో వృద్ధులకు వితంతువులకు ఒంటరి మహిళలకు మొత్తం 59 పెన్షన్లను గ్రామ సర్పంచ్ తొట్ట రాజు, ఉప సర్పంచ్ కాయితి శ్రీనివాస్ రెడ్డి వార్డు సభ్యులతో కలిసి లబ్ధిదారులకు పెన్షన్ల పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ తొట్ట రాజు మాట్లాడుతూ అర్హులైన పేద వికలాంగులకు వృద్ధులకు ఒంటరి మహిళలకు వితంతువులకు పెన్షన్లు ఎంతగానో ఉపయోగపడతాయని, అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని, తెలిపారు. లబ్ధిదారులు పెన్షన్ పత్రాలు అందుకొని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కాయితి శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్తులు లబ్ధిదారులు, పాల్గొన్నారు.

ఉప్పరపల్లిలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం

- ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్



రాజేంద్రనగర్, విశాల భారతి : రాజేంద్రనగర్ నియోజకవర్గం హైదేరగూడ డివిజన్ పరిధిలోని ఉప్పరపల్లి రెడ్డి సంఘం భవనంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత, భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. కుటుంబానికి జీవనాధారంగా ఉన్న సంపాదించే వ్యక్తి అనుకోకుండా మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులకు గురికాకుండా ప్రభుత్వమే అండగా నిలిచేందుకు ఈ పథకం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వమే పూర్తిస్థాయిలో బీమా ప్రీమియం చెల్లించి జీవిత బీమా సౌకర్యం కల్పిస్తుందని వివరించారు. ఈ పథకం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కలగడంతో పాటు ఆపత్కాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలిచే అవకాశం ఉంటుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా కమిషన్ సభ్యురాలు సదాలక్ష్మి, జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, డీసీ మల్లారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ఇంద్రపాల్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మా హామీ నువ్వే..
శివగామీ నువ్వే

సంక్రాంతి పండుగ అంటేనే బంధువుల సందడి, ఆప్యాయతలు, ఆటపాటలకు వేదిక. అలాంటి పండుగ వాతావరణాన్ని అందంగా ఆవిష్కరిస్తూ 'జనవరి 12 విడుదల' చిత్రం నుంచి 'డివికి డివికి' అనే పాటను విడుదల చేశారు. వెంకటేష్, కల్యాణ్‌రామ్, కీర్తి సురేష్, కృతిశెట్టి ప్రధాన పాత్రల్లో అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జనవరి 12న ప్రేక్షకుల ముందుకురానుంది. జీవీ ప్రకాష్‌కుమార్ స్వరపరచిన ఈ పాటను అనంత శ్రీరామ్ రచించారు. మధుప్రియ, హరిప్రియ ఆలపించారు. 'వదినా వయ్యారి, వదినా బంగారి, వదినా ఎవరైనా నీకన్నానా.. వదినా పువ్వంటి, వదినా నిప్పంటి, వదినా నీకే తందానానా.. మా హామీ నువ్వే, శివగామీ నువ్వే' అంటూ ఉత్సాహభరితమైన బీట్స్‌తో ఈ పాట సాగింది. కథానాయికలు కీర్తి సురేష్, కృతిశెట్టి సంప్రదాయ దుస్తుల్లో మెరిసిపోతూ హుషారెత్తించే డ్యాన్స్ మూమెంట్స్‌తో ఆకట్టుకున్నారు. వదినా, మరదళ్ల మధ్య ఉండే అనుబంధం, ఆప్యాయతల్ని ఆవిష్కరిస్తూ ఈ పాట ఆకట్టుకుంది.



Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.